ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 29 మే 2025 | 3



గోదావరిలో ముగిసిన సెర్చ్ ఆపరేషన్

ముమ్మిడివరం, మే 28(ఆంధ్రజ్యోతి):ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధిలోని సలాదివారిపాలెం గోదావరినదీపాయలో 8మంది గల్లంతైన ఘటనలో బుధవారం ఎనిమిదో మృతదేహం లభ్యం కావడంతో అధికారులు సెర్చ్ ఆపరేషన్ ముగించారు. కె.గంగవరం మండలం శేరిలంకలో సోమవారం జరిగిన శుభకార్యక్రమానికి హాజరైన వారిలో 11మంది అక్కడకు దగ్గరలోని కమిని పంచాయతీపరిధిలోని సలాదివారిపాలెంవద్ద నదీపాయలోకి స్నానానికి వెళ్లారు. గోదావరిలో స్నానం చేస్తుండగా ఒక్కొక్కరిగా మునిగిపోవడంతో రక్షించడానికి వెళ్లినవారు 8మంది గల్లంతయ్యారు. దీనిపై కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు స్పందించి అధికారులను అప్రమత్తం చేశారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ అధికారులు, ముమ్మిడివరం, రామచంద్రపురం, పామర్రు, ఐ.పోలవరం, కాట్రేనికోన, ద్రాక్షారామ పోలీసు యంత్రాంగం రెండు స్పీడు బోట్లు, ఐదు ఇంజను పడవలు, డ్రోన్ కెమెరా సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. జేసీ టి.నిషాంతి, అమలాపురం ఆర్డీవోలు కె.మాధవి, డి.అఖిల పరిస్థితిని సమీక్షించి సూచనలందించారు. ఎస్డీఆర్ఎఫ్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఆధ్వర్యంలో 70మంది పోలీసులు, 20మంది అగ్నిమాపక సిబ్బందితోపాటు అధికారులు పాల్గొన్నారు. మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. బుధవారం ఎనిమిదో మృతదేహం సబ్బతి క్రాంతి మాన్యువల్ లభించింది. దీంతో సెర్చింగ్ ఆపరేషన్ నిలిపివేశారు.

రెండోరోజూ.. మహానాడులో..

రెండోరోజూ కడపలో మహానాడు దిగ్విజయంగా జరిగింది. మన జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నేతలు వేదికపై ఆశీనులు కాగా కొందరు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను కలిశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న యనమల



మంత్రి లోకేశ్‌తో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కరచాలనం



వేదికపై కూర్చొన్న పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం



ఇసుకాసురుడు!

ప్రభుత్వం మారినా..ఫ్యాన్ నేతలదే పెత్తనం

- కాకినాడకు రెండు రీచ్‌లు
- పొడగట్లపల్లి, కాటవరం కేటాయింపు
- అక్కడ వైసీపీ నేత గుత్తాధిపత్యం
- ద్వారంపూడి అనుచరుడి దందా
- తెరముందు వేరే కంపెనీలు
- తెరవెనుక ఇష్టారాజ్యం
- స్టాక్‌యార్డులకు ఇసుక ససేమిరా
- ఇసుక అందక ప్రజల ఇబ్బందులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని ఇసుక రీచ్‌లపై వైసీపీ నేతల పెత్తనం కొనసాగుతూనే ఉంది. ఏ మాత్రం జంకుబొంకు లేకుండా అధికారుల సాయంతో రీచ్‌లపై పెత్తనం చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం మారినా ఆధిపత్యం చలాయిస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుక, గ్రావెల్ తవ్వకాల్లో హవా కొనసాగించిన కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అనుచరుడు ఇప్పుడు తనకు ఎదురులేదన్నట్టు వ్యవహరిస్తున్నాడు. కాకినాడ జిల్లాలో స్టాక్‌యార్డులకు ఇసుక సరఫరా చేసేందుకు కేటాయించిన రెండు ర్యాంపుల్లో పాగావేసి అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాడు.స్టాకుయార్డు నిర్వాహకులకు ఇసుక ఇవ్వాల్సి ఉండగా నిరాకరిస్తున్నారు. ఆ ఇసుకను విశాఖతో పాటు ఇతర ప్రాంతాలకు అడ్డగోలుగా విక్రయించేసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా యార్డులను దక్కించుకున్న నిర్వాహకులు జనానికి ఇసుక సరఫరా చేయలేక తలపట్టుకుంటున్నారు.

ప్రభుత్వం చేసిందిదే..

చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇసుక విధానంలో మార్పు తీసుకువచ్చింది. ఇసుక ఉచితంగా తవ్వుకునేలా ఆదేశాలిచ్చింది. వర్షాకాలంలో ఇసుకకు ఇబ్బందులు లేకుండా నియోజకవర్గాల్లో స్టాకుయార్డులను ఏర్పాటు చేసింది. వర్షాలు రావడానికి ముందే రీచ్‌ల నుంచి ఇసుక తెచ్చి వీటిలో నిల్వ చేసుకునేలా ఆదేశాలు జారీచేసింది.అందులో భాగంగా కాకినాడ జిల్లాలో పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురంలోని చిత్రాడ,కరపలోని ఉప్పలంకలో స్టాకుయార్డులకు దరఖాస్తులను ఆహ్వానించి కంపెనీలను ఎంపిక చేసింది. వీటిని దక్కించుకున్న స్టాకుయార్డు నిర్వాహకులకు కోనసీమ జిల్లా రావులపాలెం మండలం పొడగట్లపల్లి,తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కాటవరం ఇసుక ర్యాంపులను ప్రభుత్వం కేటాయించింది.ర్యాంపుల్లో ఇసుక తవ్వి స్టాకుయార్డు నిర్వాహకులకు విక్రయించేందుకు వీలుగా గనుల శాఖ కొన్ని నెలల కిందట కంపెనీలను ఆహ్వానించింది.పొడగట్లపల్లి ర్యాంపు తేజ ఇన్‌ఫ్రాటెక్, కాటవరం ర్యాంపు మిథులా కన్‌స్ట్రక్షన్ దక్కించుకున్నాయి.రెండు కంపెనీలు ఆయా ర్యాంపుల నుంచి కాకినాడ జిల్లా స్టాకుయార్డులకు ఇసుకను తవ్వి విక్రయించాలి. కానీ ఇక్కడే కథ మలుపు తిరిగింది.

దోపిడీ సాగుతుందిలా..

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ నేతలు ఇసుకను అడ్డగోలుగా దోచేసి వందల కోట్లకు పడగలెత్తారు. జనానికి ఇసుక దొరకకుండా చేసి అధిక ధరకు విక్రయించేసుకున్నారు.ఇప్పుడూ అదే చేస్తున్నారు. రెండు ర్యాంపులను దక్కించుకున్న కంపెనీలతో తెర వెనుక ద్వారంపూడి అనుచరుడైన ఓ హోటల్‌ను ఇంటిపేరుగా మార్చుకుని హవా చెలాయిస్తున్న నేత ఒప్పందం కుదుర్చుకున్నాడు. రెండు ర్యాంపుల్లో పాగావేసి ఇప్పుడు అడ్డగోలుగా ఇసుక తవ్వేస్తున్నారు. ర్యాంపుల్లో ఇసుక కాకినాడ జిల్లా స్టాకుయార్డులకే ఇవ్వాల్సి ఉండగా బిల్లులు లేకుండా బయటకు అధిక ధరకు విక్ర యించేసుకుంటున్నారు. తీరా తమ స్టాకు యార్డుకు ర్యాంపు నుంచి ఇసుక ఇవ్వాలని వెళుతున్న నిర్వాహకులను బెదిరిస్తున్నాడు. ఇసుక కోసం వెళ్లిన లారీలను సైతం వెనక్కు తిప్పి పంపిచేస్తున్నారు. అయినా రీచ్‌లు అధికారికంగా దక్కించుకున్న కంపెనీలు విషయం తెలిసి సదరు నేతకు సహకరిస్తున్నాయి. ద్వారంపూడి అనుచరుడు కాకినాడసిటీలో భూదాన్ భూమిలో కేటాయించిన స్టాకుయార్డును గుప్పిట్లో ఉంచుకుని తన ఆధీనంలో ఉన్న రెండు ర్యాంపుల నుంచి భారీగా ఇసుక తరలించేస్తున్నారు. ఇతర స్టాకుయార్డులకు మాత్రం ఇసుక ఇవ్వకుండా గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాడు. తాజాగా కాకినాడ సిటీ యార్డును భూదాన్ భూమి నుంచి తరలించాలని హైకోర్టు ఆదేశించడంతో ఇప్పుడు ఆ యార్డును గనులశాఖ రద్దు చేసింది.మరో పక్క వైసీపీ ఐదేళ్ల పాలనలో సదరు నేత అనుచరుడు కాకినాడ జిల్లాలో చెలరేగిపోయాడు. కనిపించిన చెరువులు,కొండల్లో గ్రావెల్ తరలించి కోట్లలో సంపాదించాడు. ఇప్పుడు ప్రభుత్వం మారిన తర్వాత కూడా ఇసుక ర్యాంపులను గుప్పిట పెట్టుకుని సదరు నేత అనుచరుడు అడ్డగోలుగా ఆధిపత్యం చెలాయిస్తున్నా అధికారులు కిమ్మనడం లేదు.



కడుపు నిండా తిండి పెట్టండి.. కంటిపై కునుకు వేస్తే చితక్కొట్టండి.. ఈ డైలాగు ఏదో ఫేమస్ సినిమాలో విన్నట్టుంది కదూ!.అవును.. విలన్‌ని ఉద్దేశించి పోలీస్ అధికారి ఇచ్చే ఆదేశమది. ఇప్పుడు మందుబాబుల పరిస్థితి కూడా కాస్త అటూ ఇటుగా అలాగే ఉంది. పిచ్చి బ్రాండ్లు.. నాసిరకం మందు.. అధిక ధరలతో ఐదేళ్లు విసిగిపోయారు. ప్రస్తుత ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం అందుబాటులోకి వచ్చినా స్వేచ్ఛగా తాగడానికి వీల్లేక సతమతమైపోతున్నారు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పట్టుకుంటే.. పది వేలు!

మందెక్కడ తాగాలి మహాప్రభో

- చుక్క పడాలంటే సాహసమే
- పర్మిట్ రూంలు లేక ఇబ్బంది
- బయట తాగితే నేరం..ఫైన్
- ఉమ్మడి జిల్లాలో 455 షాపులు
- మందుబాబులు సతమతం
- పోలీసుల నిఘాతో గగ్గోలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాణ్యమైన మద్యం అందు బాటులోకి వచ్చింది. సుమారు 200 బ్రాండ్లు కళ్లెదుట కనబడుతున్నాయి. కానీ చుక్క గొంతులో పోసుకోవడానికి సాహసం చేయాల్సి వస్తోంది. దీనికి కారణం చుక్క మింగడానికి చోటు లేకపోవడమే. ఇంట్లో అనుమతి ఉండదు.. బయట నాలుక తడుపుకుందామంటే నేరం.. బార్‌లకు వెళదామంటే అదనపు ధరలు.. ఎక్కడో చోట ఏదోలా తాగేసి ఇంటికి పోదామంటే నోట్లో గొట్టం పెట్టి ఊద మనే పోలీసులు.. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం నాణ్యమైన సరుకు..సరసరమైన ధరలు తెచ్చిందని సంతోషించాలా?.. తాగ డానికి జాగా లేదని నొచ్చుకోవాలా అని సగటు మద్యం వినియోగదారుడు ప్రశ్నిస్తున్నాడు. విసిగిపోయి పాలకులపై చిందులేస్తున్నాడు.

ఎక్కడ తాగేది?

వైసీపీ ప్రభుత్వంలో సామాన్యులు క్వార్టరు తాగాలంటే రూ.500 ఆవిరైపోయేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చిన దరిమిలా మందుబాబులకు మళ్లీ మంచిరోజులు వచ్చాయి. అయితే పర్మిట్ రూంలు లేక తాగడానికి ఇబ్బందులు పడుతున్నారు. మద్యం దుకాణాల వద్ద అనధికారికంగా సిట్టింగ్‌లు ఉన్నా బెరుగ్గానే తాగాల్సిన పరిస్థితి ఉంది. బార్‌లకు రెండేళ్ల లైసెన్సును గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఏడాది సెప్టెంబరు వరకూ బార్‌లకు అనుమతి ఉండడంతో కూటమి కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చే సమయంలో బార్‌లతో ఒక ఒప్పందం జరిగింది. బార్‌ల లైసెన్సు గడువు ముగిసే వరకూ పర్మిట్ రూంలకు అనుమతులివ్వబోమని.తీరా ప్రైవేటు మద్యం షాపులు అందుబాటులోకి వచ్చిన తర్వాత తాగడానికి వీల్లేక నాణ్యమైన మందు దొరుకుతున్నా ప్రభుత్వ ఉద్దేశం పూర్తిగా నెరవేరడం లేదు. కొందరు మద్యం తాగుతారని వాళ్ల ఇళ్లల్లో తెలియకుండా జాగ్రత్త పడతారు. మరి కొం దరికి ఇంట్లో తాగే పరిస్థితులు ఉండవు.చాటుమాటు ప్రదేశంలో మద్యం తాగాలన్నా డేగ కళ్లతో తిరుగుతున్న పోలీసులకు చిక్కామా అంతే. తొలుత కేసు..తర్వాత కోర్టు.. ఆపై రూ.10 వేల ఫైన్. క్వార్టరు మందు రూ.200కే అందుబాటులో ఉన్నా..దానిని ఇంటి బయట గొంతు దాటించాలంటే మాత్రం మరో రూ.15 వేల ఖర్చుకు సిద్ధపడాల్సిందే.ఇప్పుడు ఎక్సైజ్ శాఖ దుకాణాల వద్ద తాగితే ఊరుకోబో మం టూ పెట్రోలింగ్ మొదలుపెట్టింది.ఈ పరిస్థితుల్లో చాలా మంది స్నేహితుల రూంలు,జన సంచారం లేని ప్రాంతాల్లో భయంభయంగానే పని కానిస్తున్నారు.

31% దాటితే రూ.10వేలు

పోలీసులు బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేస్తుం టారు.రక్తంలోని మద్యం శాతాన్ని అది కొలు స్తుంది.బ్రీత్ ఎనలైజర్‌కి ఉంచే గొట్టంలో ఎవరు ఊదినా బీప్ శబ్దం వస్తుంది. కానీ 31% ఆపై రీడింగ్ చూపిస్తే మాత్రం సదరు వ్యక్తి ఫొటోతో సహా ఆన్‌లైన్‌లో నమోదైపోవడంతో పాటు కేసు నమోదవుతుంది. పోలీసులు చెప్పిన సమయానికి కోర్టుకు వెళితే రూ.10 వేలు ఫైన్. ఆపై బయట 'ఇతర' ఖర్చులూ ఉంటాయి. కల్లు తాగినా, ఓ లైటు బీరు కొట్టినా రీడింగ్ 31 దాటిపోతోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేసులు 4926

తూర్పుగోదావరిలో 138, డా.బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 146, కాకినాడ జిల్లాలో 171 మొత్తం మన్యం మినహా ఉమ్మడి తూర్పులో 455 ప్రైవేటు మద్యం దుకాణాలు ఓ 50 బార్లు ఉన్నాయి. డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఈ ఏడాది ఇప్పటివరకూ తూర్పుగోదావరిలో 496 కేసులు నమోదు చేయగా 245 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా వేయగా 16 మందికి జైలు శిక్ష పడింది. 217 కేసులు విచారణ జరగాల్సి ఉంది. కోనసీమలో 1230, కాకినాడ జిల్లాలో 3200 కేసులు పెట్టగా రూ.20 లక్షల వరకూ మందుబాబులు ఫైన్లు కట్టారు.

జిల్లావ్యాప్తంగా సినిమా థియేటర్లలో తనిఖీలు

- యజమానులకు అధికారుల సూచనలు
- అమలాపురంలో తనిఖీలు చేపట్టిన జేసీ

అమలాపురం,మే 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల అధికారులు బుధవారం సినిమా థియేటర్లలో తనిఖీలు నిర్వహించారు. అమలాపురంతోపాటు మండపేట, రావులపాలెం, ద్రాక్షారామ, పి.గన్నవరం, మలికిపురం, ముమ్మిడివరం, సఖినేటిపల్లి, రాయవరంల్లోని సినిమా థియేటర్లలో ఈ దాడులు జరిగాయి. అమలాపురంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తనిఖీలు చేపట్టారు. థియేటర్ల యాజమాన్యాలు సినిమాటోగ్రఫీ నిబంధనలు తప్పనిసరిగా పాటించిహైజనిక్‌గా అన్ని అనుమతులతో నిర్వహించుకోవాలని సూచించారు. థియేటర్ల వివాదం నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు పలు థియేటర్లను బుధవారం తనిఖీ చేశారు. అమలాపురంలోని శేఖర్ థియేటర్‌లో జేసీ ఆకస్మిక తనిఖీచేసి ఆహార పానీయాల ధరలు, అపరిశుభ్రతలపై పరిశీలించారు. థియేటర్ యాజమాన్యాలు పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరుస్తూ హైజీనిక్‌గా నిర్వహించాలని సూచించారు. ఆహార పానీయాల వంటి రేట్లను పెంచకుండా విక్రయించాలని, థియేటర్ పరిసర ప్రాంతాన్ని కూడా శుభ్రంగా ఉంచాలని సూచించారు. లైసెన్సు, ఫైర్‌లైసెన్సు, పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, సినిమా టిక్కెట్లు, క్యాంటీన్ విక్రయాల ధరలు, తాగునీటి సదుపాయం వంటి వాటిని పరిశీలించారు. అగ్నిమాపక యంత్రాలు, థియేటర్‌లో నిర్వహణ వ్యవస్థ ఆటోమెటిక్, మాన్యువల్‌గా పనిచేసే ఎలక్ట్రికల్ ఫైల్ అలారం సిస్టమ్, వాటర్ స్టోరేజ్ ట్యాంకు సామర్థ్యం వంటి అంశాలపై యాజమాన్యాల నుంచి సమాచారం సేకరించారు. టిక్కెట్ల ధరలు పెంచి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల మరుగుదొడ్లను జేసీ నిషాంతి స్వయంగా వెళ్లి పరిశీలించి లోపాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మాత్రమే సినిమా థియేటర్ల నిర్వహణ ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తనిఖీల్లో తహశీల్దార్ అశోక్‌ప్రసాద్, వీఆర్వో ఎస్.యేల్లేశ్వరరావు పాల్గొన్నారు.



అమలాపురంలో సినిమా థియేటర్‌లో తనిఖీ చేస్తున్న జేసీ నిషాంతి

కలెక్టరేట్‌లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

అమలాపురం, మే 28(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ సీఎం, స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి వేడుకలను జిల్లాలో అధికార యంత్రాంగం తొలిసారిగా ఘనంగా నిర్వహించింది. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో ఎన్టీఆర్ 102వ జ యంతి వేడుకలను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించారు. మహిళలకు ఆస్తిహక్కు కల్పించడం, పేదలకు కిలో రూ.2 పథకాన్ని అమలుచేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని, సినీరంగంలో కీర్తి పతాకాన్ని ఆవిష్కరించిన మహానటుడిగా గుర్తింపు పొందిన ఎన్టీఆర్ 13ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో అద్భుతాలు సాధించారని కలెక్టర్ కొనియాడారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి జిల్లా అధికారుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో రాజకుమారి, ఏవో విశ్వేశ్వరరావు, వికాస జిల్లా మేనేజర్ రమేష్ డీఈవో షేక్ సలీంబాషాతోపాటు అధికారులు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు

ఎస్పీ కార్యాలయంలో..

అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి ఎస్పీ బి.కృష్ణారావు పూలమాలలువేసి నివాళులర్పించారు. అడిషనల్ ఎస్పీ, ఎస్పీ కార్యాలయ సిబ్బంది ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ప్రజాపరిపాలనలో ఎన్నో మార్పులు తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని పలువురు కొనియాడారు.

'రాష్ట్రీయ బాల్ పురస్కార్‌కు దరఖాస్తులు చేసుకోండి'

అమలాపురం టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): విభిన్న రంగాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన పిల్లలకు కేంద్రం ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్‌పురస్కార్ ప్రదానం చేస్తుందని జిల్లా మహిళాభివృద్ధి, శిశుంసక్షేమశాఖ సాధికారిత అధికారిణి బి.శాంత కుమారి తెలిపారు.కేంద్రప్రభుత్వమహిళా, శిశుఅభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అసాధారణమైన వీరోచిత చర్యలు చేసిన 6నుంచి 18ఏళ్లలోపు పిల్లలకు జాతీయ పురస్కారం అందజేస్తారన్నారు. క్రీడలు, కళలు, సంస్కృతి తదితర రంగాల్లో కృషి చేసిన వారికి కూడా పీఎం ఆర్పీబీ ప్రదానం చేస్తారన్నారు. ఈ అవార్డులకోసం జూలై 31వరకు దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. జాతీయ ప్రాముఖ్యత దృష్ట్యాగ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, శ్రేష్టమైన పని చేసిన పిల్లలను సిఫార్సు చేయాలని కోరారు. ధ్రువీకరణకు కలెక్టర్‌కు నివేదించి కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

సీఎం పర్యటనలో అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి

అధికారులకు కలెక్టర్, ఎస్పీ సూచనలు

అమలాపురం, మే 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఈనెల 31న కాట్రేనికోన మండలం చెయ్యేరులో జరపనున్న పర్యటనకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖలకు చెందిన అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. అధికారులు ఏర్పాట్లు ఎవరెవరు ఏమేం నిర్వహించాలనే దానిపై సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు సామాజిక భద్రత పించన్ల పంపిణీ కార్యక్రమం అక్కడ ఉంటుందని, ప్రజావేదికవద్ద పీ4 బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు దత్తత ఇచ్చే కార్యక్రమం ఉంటుందన్నారు. చెయ్యేరులోనే ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు పూడికతీత పనులు పరిశీలిస్తారని, తదుపరి ప్రజావేదిక వద్ద ప్రసంగిస్తారని, చివరగా పార్టీ ప్రతినిధులతో సమావేశాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. విధులు నిర్వహించే అధికారులకు లొకేషన్ మ్యాప్‌లను షేర్ చేస్తామని, ఆరోజు ఉదయంనుంచి సాయంత్రం వరకు పర్యటన కొనసాగే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వానపల్లిలో గత ఆగస్టు నెలలో సీఎం పర్యటనలో ఉత్పన్నమైన సమన్వయ లోపాలు పునరావతం కాకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని పర్యటనను విజయవంతం చేయాలన్నారు. డీఆర్డీఏ పీడీ ప్రజావేదిక వద్ద క్రౌడ్ మేనేజ్‌మెంట్, బంగారు కుటుంబానికి సంబంధించి ఆర్థిక స్థితిమంతులైన మార్గదర్శకులను ఎంపిక చేసి దత్తత తీసుకునే వారి వివరాలను అందించి వారంతా ప్రజావేదికవద్దకు హాజరయ్యేలా డీఎల్డీవో బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. వాహనాల పార్కింగ్ బాధ్యతలను కొందరు అధికారులకు అప్పగించారు. అంబులెన్సులు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని హెల్త్ అధికారులకు సూచించారు. హెలిప్యాడ్‌వద్ద రామచంద్రపురం ఆర్డీవో ఇన్‌చార్జిగా ఉంటారు. బారికేడింగ్, రోడ్ల నిర్వహణను ఆర్‌అండ్‌బీ, జియో, బయో టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్డీవో, అడిషనల్ ఎస్పీలు కాన్వాయ్ ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. మీడియాకు బస్సుసౌకర్యంతోపాటు పాస్‌ల మం జూరులో డీఆర్వోకు బాధ్యతలు అప్పగించారు. ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెయ్యేరు పర్యటనను భారీ బందోబస్తుతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమన్వయ లోపాలకు తావు లేకుండా సమష్టిగా పని చేయాలని కోరారు. జేసీ నిషాంతి డీఆర్వో రాజకుమారిలు అధికారులకు సూచనలు చేశారు.



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

రోడ్డు భద్రతా నిబంధనలు కఠినంగా అమలు చేయాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రజాజీవితాల రక్షణకు రహదారి భద్రతా నిబంధనలను మరింత కఠినంగా అమలుచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల భద్రతే ప్రజాజీవితాలకు రక్షణగా నిలుస్తుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. జొన్నాడ-రావులపాలెం తదితర పెద్దపెద్ద వంతెనల మీద సోలార్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. హైవే వెంబడి ఉన్న పెట్రోలు బంకులవద్ద ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న 16 బ్లాక్ స్పాట్‌లను గుర్తించి పకడ్బందీ చర్యలను చేపట్టాలని సూచించారు. జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగవంతం చేసి అక్టోబరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఎస్పీ బి.కృష్ణారావు, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, హైవే విభాగం పథక సంచాలకుడు సురేంద్ర, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు తదితరులు

పసుపు జాతర


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ




వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం



రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.






మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు


మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..






నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజిలేస్తే...


కార్యకర్తల ఉత్సాహం..


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు

కాకినాడలో క్రికెట్ పండుగ

కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో 1, 2, 3 తేదీల్లో ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ ఈవెంట్... ప్రవేశం ఉచితం: ఎంపీ సతీష్‌బాబు

కార్పొరేషన్ (కాకినాడ), మే 28 (ఆంధ్రజ్యోతి): జూన్ 1, 2, 3 తేదీల్లో గుంటూరులో నిర్వహించాల్సి వున్న రెండు ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ ఈవెంట్లు కాకినాడ జిల్లా క్రీడా మైదానానికి మారాయి. రాజ్యసభ సభ్యుడు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్‌బాబుకు తన ప్రాంతం పైనున్న ప్రేమ, ఆకుంఠిత దీక్ష ఫలితంగా ఇది సాధ్యమైంది. భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లపై ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రదర్శన, సంగీతం, డీజేలు, స్థానిక కళాకారుల ప్రదర్శనలు ఉంటాయి. కాకినాడ స్పెషల్స్‌తో ఫుడ్ కోర్టులు ఏర్పాటుచేస్తారు. కుటుంబానికి అనుకూలమైన కార్యక్రమాలు, పిల్లల కోసం ఆటల పోటీలు. ఉచిత ప్రవేశం, లక్కీడ్రా, ఐపీఎల్ మెర్చండైజ్ బహుమతులు. ఈ క్రికెట్ ఉత్సవాన్ని కాకినాడకు తీసుకురావడం గర్వకారణం మాత్రమే కాదు, భావోద్వేగకరమైన విషయం కూడా. ప్రతి కుటుంబం, యువత, ప్రతి క్రికెట్ అభిమాని ఈ ఉత్సవంలో పాల్గొని కాకినాడ పేరు మార్మోగేలా చేయాలని ఎంపీ సతీష్‌బాబు కోరారు.


కాకినాడలో ఏర్పాటు చేయనున్న భారీ ఎల్ఈడీ స్క్రీన్


ఒప్పంద అధ్యాపకులతో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అర్జునుడు

కాకినాడ జేఎన్టీయూలో
మూడో రోజుకు ఒప్పంద అధ్యాపకుల నిరసన

జేఎన్టీయూకే, మే 28 (ఆంధ్రజ్యోతి): తమను గతంలో మాదిరిగానే కొనసాగించాలని కోరుతూ కాకినాడ జేఎన్టీయూలో యూసీఈకే, వర్సిటీ ఒప్పంద అధ్యాపకులు చేపట్టిన నిరసన బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సమస్యపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ)ని ఒప్పంద అధ్యాపకులు కలిసి వివరించారు. ఒప్పంద అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. అర్జునుడు నిరసనకు మద్దతు తెలిపారు. ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్‌ని కలిసి సమస్యపై చర్చించారు. సాయంత్రం ఆరు గంటల వరకు వేచి చూసినా పరిష్కారం లభించలేదు. గురువారం కూడా నిరసన కొనసాగిస్తామని ఒప్పంద అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ సుధీర్‌కుమార్ చెప్పారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

పి-4 విధానాన్ని ఉపసంహరించుకోవాలి: ప్రజారోగ్య వేదిక సమావేశంలో వక్తల డిమాండ్

కాకినాడ సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదని, పి-4 విధానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రజారోగ్య వేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. కాకినాడ యూటీఎఫ్ హోంలో 'ప్రభుత్వ వైద్య కళాశాలలు-ప్రైవేటీ కరణ' అంశంపై బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజారోగ్య వేదిక నగర కన్వీనర్ పి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు ముఖ్య వక్తగా ప్రసంగించారు. పి-4 విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే వైద్యంలో నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. సమావేశంలో డాక్టర్ గోపీనాథ్, ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక ప్రజా సంఘాల నాయకులు జి.ప్రభాకరవర్మ, కె.సత్తిరాజు, ఎంఏ స్వామి, చంద్రమళ్ల పద్మ, జి.స్వామినాయుడు, జీఎస్ వర్మ, మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

33	19	20	30
22	28	27	25
26	24	23	29
21	31	32	18

ఎటు కూడినా 102

ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా మ్యాజిక్ స్క్వేర్ రూపొందించిన గణితావధాని సాయిరామకృష్ణ



కరప, మే 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 102వ జయంతి సందర్భంగా గణితావధాని, జాతీయ ఉత్త మ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ మ్యాజిక్ స్క్వేర్ రూపొందించారు. వాడిన సంఖ్యను తిరిగి వాడకుండా రూపొందించిన ఈ చదరంలో నిలువు, అడ్డు, క్రాస్.... ఇలా ఎలా కూడినా నాలుగు సంఖ్యల మొత్తం 102 వస్తుంది. ఎరుపు, పచ్చ, పసుపు గడుల్లోని నాలుగు సంఖ్యలను కలిపినా 102 వస్తుంది. యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సంస్థ క్రియేటివ్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న సాయిరామకృష్ణను వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ (చిన్న మాస్టారు), సభ్యులు దొడ్డిపట్ల అప్పలరాజు, చింతా నారాయణరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చింతాడ ప్రదీప్‌కుమార్ అభినందించారు.

ఉద్యోగ కల్పనే టాటా ఇన్నోవేషన్ హబ్ లక్ష్యం

- ఏర్పాట్ల పరిశీలనలో రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్


టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసే భవనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా రాజమహేంద్రవరంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరులోని ఆర్టీఐ హెచ్ భవనంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు పనులను కమిషనర్ కేతన్ గార్గ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మొత్తం 4,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆర్టీఐహెచ్ భవనాన్ని ఏర్పాటు చేసుకుంటున్నట్టు తెలిపారు. జూన్ 12న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సంబంధించి ఇప్పటికే బోర్డుకమిటీ ఏర్పాటు కాగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్ఎంసీ కమిషన్ సభ్యులుగా ఉన్నారన్నారు. అలాగే బోర్డు కమిటీ గవర్నింగ్ వ్యవస్థకు గ్రీన్‌కో ఎనర్జీ, ఓఎన్‌జీసీ, గెయిల్, అవంతి తదితరులు ప్రమోటర్లుగా ఉంటారన్నారు. స్కిల్స్ డెవలప్మెంట్, ఇన్నోవేషన్, స్టార్టప్స్ ఫెసిలిటేషన్ కేంద్రంగా ఈ హబ్ ఏర్పాటు కానుందని కమిషనర్ పేర్కొన్నారు. యువతకు ఆసక్తి గల రంగాల్లో దిశనిర్దేశం చేయడం, వారికి తగిన నాలెడ్జి అందించడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో రాజమహేంద్రవరంలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి ఈ ఇన్నోవేషన్ హబ్ దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంట ఈఈ మదర్షా అలీ, ఇతర అధికారులు ఉన్నారు.

థియేటర్లు బంద్ చేయాలనే ఆలోచన లేదు

- పర్సంటేజీ ఇస్తేనే సినిమా రన్ చేయగలమని మాత్రమే చెప్పాం
- సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తూర్పు అధ్యక్షుడు బాబు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాబు

రాజమహేంద్రవరం అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): థియేటర్లను బంద్ చేయాలనే ఆలోచన లేదని, పర్సంటేజీ ఇవ్వకపోతే జూన్ 1 నుంచి సినిమా రన్ చేయలేమని మాత్రమే చెప్పామని సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోళ్ల అచ్యుతరామారావు (బాబు) అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సినిమా థియేటర్లు నడపడం చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. పెద్ద సినిమాలు లేకపోవడం వల్ల ఆదాయం రావడంలేదని, ఆదాయం లేని పరిస్థితుల్లో జూన్ 1 నుంచి థియేటర్లు మూసివేయాలని ఏప్రిల్ 19న జరిగిన సమావేశంలో నిర్ణయించుకున్నామని, ఎవరైనా సినిమా వేసుకుంటే వేసుకోమని కూడా చెప్పామన్నారు. దీనిపై ఏపీ ఫిలిం ఛాంబర్‌కు సమాచారం పంపించామని తెలిపారు. 'డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హరిహర వీరమల్లు సినిమా విడుదలైతే ప్రేక్షకులు వస్తారు. మాకూ పదిరూపాయల వస్తాయి. ఆనందమే అన్నారు. అన్ని థియేటర్లలోనూ పవన్ సినిమా వేస్తాం. ఆ నలుగురితో మాకు సంబంధంలేదు' అని అన్నారు. పెద్ద హీరోలు ఇండస్ట్రీని బతికించాలని, ఏడాదికి కనీసం రెండు సినిమాలు అయినా చేయాలని కోరుకుంటున్నామని అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 180 వరకూ థియేటర్లు ఉంటే వీటిలో 70 వరకూ మాత్రమే నడుస్తున్నాయని, ఇవి కూడా ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయన్నారు. ఈ వ్యవహారంతో జనసేన సిటీ ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణకు ఎలాంటి సంబంధంలేదని, ఇందులో ఆయన హస్తం లేదని స్పష్టం చేశారు. అధికారులకు థియేటర్లను తనిఖీలు చేసే అధికారం ఉంటుందని, లోపాలుంటే కేసులు రాస్తారని అన్నారు. ఛాంబర్ పెద్దలు త్వరలో విశాఖపట్నంలో ఒక జాయింట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని, ఆ సమావేశంలో తీసుకునే నిర్ణయంపైనే భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని బాబు వెల్లడించారు. మీడియా సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు డి.శ్రీనివాస్, ఎం.సదాశివ, జి.రామారావు, జాస్తి బాపయ్య తదితరులు పాల్గొన్నారు.

థియేటర్లలో నిబంధనల ఉల్లంఘనలు: జేసీ

రాజమహేంద్రవరం, మే 28(ఆంధ్రజ్యోతి): సినిమా థియేటర్లలో నిబంధనల ఉల్లంఘనలను గుర్తించామని, ఆయా యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తామని జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు పేర్కొన్నారు. సినిమా థియేటర్ల తనిఖీలు బుధవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు థియేటర్లలో టికెట్లు, అల్పాహారం, కూల్‌డ్రింక్స్ ధరలు అధికంగా ఉన్నాయని, పారిశుధ్యం బాగోలేదన్నారు. యాజమాన్యాలు ధరల పట్టికలను కచ్చితంగా ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వ నిర్దేశాలను అనుసరించి జిల్లాలో సినిమా థియేటర్లలో తనిఖీలు చేస్తున్నామన్నారు. రాజమండ్రి డివిజన్‌లో 25, కొవ్వూరు డివిజన్‌లో 15 థియేటర్లు ఉన్నాయన్నారు. ధరలపై నియంత్రణ ఉండాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి మాత్రమే టికెట్ల ధరల పెంపునకు అనుమతులిస్తామన్నారు. గీతా అప్సర, శ్యామల, స్వామి థియేటర్లలో తనిఖీలు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణ నాయక్, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రుక్కయ్య, అర్బన్ తహశీల్దారు పాపారావు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి జేవీవీ సభ్యత్వ నమోదు

కాకినాడ సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల వివిధ స్థాయి బాధ్యులకు జన విజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్ అధ్యక్షతన బుధవారం కాకినాడ యూటీఎఫ్ హోంలో ప్రాంతీయ సదస్సు జరిగింది. ఉదయం సెషన్‌లో మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం 'చరిత్రలో సైన్స్' అంశంపై మాట్లాడుతూ ఏ సందర్భంలో సైన్స్ ఏ విధంగా వ్యవహరించిందో వివరించారు. మధ్యాహ్నం సెషన్‌లో మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ 'జేవీవీ నిర్మాణం-కొన్ని ప్రాధాన్యతలు' అంశంపై ప్రసంగించారు. జూన్ 1 నుంచి జేవీవీ సభ్యత్వ నమోదు ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా జరగనుందన్నారు.

గోదారిలో గల్లంతై.. మృతదేహాలుగా తేలి..

- ముగ్గురు బాలురు మృతదేహాలు లభ్యం
- గంటల వ్యవధిలోనే వెలికితీసిన ఎస్డీఆర్ఎఫ్ బృందాలు
- రాజోలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం
- నాగుల్లంక గ్రామంలో విషాదఛాయలు


కేతా ప్రవీణ్ మృతదేహం


నీతిపూడి పాల్‌కుమార్ మృతదేహం


సూర్యతేజ మృతదేహం

పి.గన్నవరం/ఆచంట, మే 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక దిగువున ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా సరిహద్దు ప్రాంతం నాగుల్లంక దిగువున రావిలంకలో గోదావరిలో గల్లంతైన ముగ్గురు బాలురు మృతదేహాలుగా తేలారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టడంతో ప్రమాదానికి కొన్ని గంటల వ్యవధిలోనే వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. ప్రమాద ఘటనకు సమీపంలో కేతా ప్రవీణ్ (15), సానబోయిన సూర్యతేజ(12) మృతదేహాలు బుధవారం తెల్లవారుజామున లభ్యమయ్యాయి. నీతిపూడి పౌల్‌కుమార్(15) మృతదేహం మాత్రం ప్రమాద స్థలికి సుమారు కిలో మీటరు దూరంలో లభ్యమైంది. మృతదేహాలను రాజోలు ప్రభుత్వాసుత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. స్థానిక ఎస్ఐ బి.శివకృష్ణ, తహశీల్దార్ పి.శ్రీపల్లవి సంఘటనా స్థలం వద్ద గాలింపు చర్యలను పరివేక్షణ చేయగా ఆచంట ఎస్ఐ కె.వెంకటరమణ మృతులు బంధువులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అలాగే గాలింపు చర్యల్లో ఎస్డీఆర్ఎఫ్ ఏసీ మోహనరావు, ఎస్ఐ రఘు, బృంద సభ్యులు పాల్గొన్నారు. బాలుర మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నాగుల్లంకలోని మృతుల కుటుంబాలు వద్దకు వెళ్లి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మృతదేహాల వద్ద నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా మృతదేహాలను పరిశీలించి తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఘటన తనను ఎంతో బాధించిందని, బాలుర కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


వశిష్టనదిపాయలో గాలింపు చర్యల్లో ఎస్డీఆర్ఎఫ్ బృందం



నాగుల్లంక ఏటిగట్టు వద్ద అంబులెన్స్‌లో మృతదేహాలను చూసి రోదిస్తున్న ప్రవీణ్ తల్లి, బంధువులు

చిన్నోడా లే...

చిన్నా...చిన్నా...చిన్నోడా లే అంటూ మృతదేహాన్ని కదుపుతూ తన కొడుకు కోసం ఓ అమ్మ పడిన రోదన..... ప్రవీణ్ మనల్ని వదిలిపెట్టి వెళ్లి పోతున్నాడే అంటూ పెద్దమ్మ ఆవేదన అక్కడి వారి గుండెలను పిండేసింది. గోదావరిలో గల్లం తైనవారిలో కేతా ప్రవీణ్, సూర్యతేజ మృతదేహాలను అంబులెన్స్‌లో రాజోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో నాగుల్లంక ఏటిగట్టుపై మృతు డు తల్లికి, బంధువులు చూపించగా వారు బో రున విలపించారు. కాగా సూర్యతేజ, పౌల్ కుమార్ వరసకు బావమరదులు కాగా ఇద్దరు తల్లులు ఉపాధి కోసం గల్ఫ్‌లోనే ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే ఇంటికి రావడానికి టిక్కెట్లు తీసుకున్నారని బంధువులు తెలిపారు.



ఒక్కరేసే సంతానం

ప్రమాద ఘటనలో రెండు కుటుంబాలకు ఒక్కొక్కరే సంతానం. మరొకరికి సోదరి మాత్రం ఉన్నారు. ఇచ్చిన ఒక్క సంతనాన్ని దేవుడు తన వద్దకు తీసుకుపోయాడంటూ ఆ కుటుంబాలు రోదించాయి. ఏడుకొండలు, దుర్గాభవాని దంపతులకు సూర్యతేజ ఒక్కడే సంతానం, వెంకటేశ్వరావు, సరోజని దంపతులకు ప్రవీణ్ ఒక్కడే సంతానం. మూడేళ్ల క్రితం తండ్రిని కోల్పోయిన పౌల్‌కుమార్‌కు సోదరి ఉంది. ఈ ప్రమాద ఘటనతో నాగుల్లంక గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

సూర్యతేజను కడసారి చూసుకుంటున్న తండ్రి ఏడుకొండలు

సలాదివారిపాలెం ఘటనలో...
క్రాంతి కిరణ్ మృతదేహం లభ్యం


క్రాంతి కిరణ్ మృతదేహం


ఫైల్‌ఫొటో

ముమ్మిడివరం, మే 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధి సలాదివారిపాలెంలో గౌతమీ గోదావరి నదీ పాయలో స్నానానికి దిగి గల్లంతైన సబ్బిత క్రాంతి కిరణ్ (19) మృతదేహం బుధవారం వైఎస్సార్ వారధి సమీపంలో లభ్యమైంది. కె.గంగవరం మండలం శేరిలంకలో సోమవారం జరిగిన ఒక శుభ కార్యక్రమానికి విచ్చేసిన పలువురిలో 11 మంది గోదావరి నదీ పాయలో స్నానానికి వెళ్లగా వారిలో ఎనిమిది మంది గల్లంతైన విషయం విధితమే. ఏడు మృతదేహాలను మంగళవారం సాయంత్రానికి రెస్క్యూ ఆపరేషన్ బృందం బయటకు తీయగా బుధవారం ఉదయం క్రాంతి కిరణ్ మృతదేహం వైఎస్సార్ వారధి సమీపంలో లభ్యమైంది. పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ బృందం బయటకుతీసి పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో సెర్చింగ్ ఆపరేషన్‌ను పోలీస్‌లు,అధికారులు ముగించారు.

కాకినాడలో క్రాంతి, అభిషేక్ అంత్యక్రియలు


క్రాంతి కిరణ్, పాల్ అభిషేక్ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించిన దృశ్యం

కాకినాడ, మే 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధి సలాదివారిపాలెంలో గోదావరి నదిలో స్నానానికి వెళ్లి విగతజీవులుగా మారిన కాకినాడ జగన్నాథపురం గోళీలపేటకు చెందిన సబ్బిత క్రాంతి కిరణ్ (19), సబ్బిత పాల్ అభిషేక్ (18) మృతదేహాలను బుధవారం మధ్యాహ్నం కాకినాడకు తీసుకొచ్చారు. బంధువులు, మిత్రులు, సంఫీయులు, స్థానికుల సందర్శనార్థం కొద్దిసేపు ఉంచి అక్కడి నుంచి భారీ ఊరేగింపు మధ్య జగన్నాథపురంలోని ఏపీటీ సమీపంలో ఉన్న క్రైస్తవ స్మశాన వాటికకు తీసుకెళ్లారు. అక్కడ క్రైస్తవ సంప్రదాయ పద్ధతిలో ఖననం చేశారు. అందరితో కలివిడిగా ఉండే క్రాంతి, పాల్ మరణాన్ని స్థానికులతో పాటు బంధువులు, మిత్రులు, సన్నిహితులు జీర్ణించుకోలేకపోయారు. వారి స్నేహితులు, క్లాస్‌మేట్స్ పెద్ద ఎత్తున తరలివచ్చారు. విగతజీవులుగా ఉన్న తమ స్నేహితులను చూసి కన్నీటిపర్యంతమయ్యారు.

వ్యాపారికి అకౌంటెంట్ నమ్మక ద్రోహం

రూ.12లక్షల విలువైన ఆభరణాలు, నగదుతో ఉడాయింపు

కేసు నమోదు చేసిన పోలీసులు

అమలాపురం టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ప్రముఖ వ్యాపారి వద్ద ఐదేళ్లుగా నమ్మకంగా పనిచేస్తున్న వ్యక్తి రూ.12లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, నగదుతో ఉడాయించాడు. వెంటనే తేరుకున్న యజమాని అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన జీకే రెస్టారెంట్ యజమాని గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు అలియాస్ కాసుబాబు వద్ద అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన కంతేటి రాజు గత ఐదేళ్లుగా అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ముమ్మిడివరంలోని సీఎస్ బ్యాంకులో కాసుబాబు బంగారు ఆభరణాలను కుదవ పెట్టుకున్నాడు. వాటిని విడిపించుకురమ్మని అక్కౌంటెంట్ రాజుకు నగదు ఇచ్చి ఈ నెల 26న పంపించాడు. బ్యాంకులో ఆభరణాలను విడిపించుకుని రూ.2.25లక్షల మిగులు నగదుతో వెనుదిరిగాడు. ఆ తరువాత రూ.9.66 లక్షల విలువైన 322 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2.25లక్షల నగదుతో ఉడాయించాడు. విషయం తెలుసుకున్న యజమాని కాసుబాబు ఈ నెల 27వ తేదీ రాత్రి అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాసుబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

దైవ దర్శనానికొచ్చి.. కొలనులో కన్నుమూసి

అన్నవరంలో యువకుడి మృతి


మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న పోలీసులు


మరణించిన చరణ్

అన్నవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి చక్రస్నానం నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన కొలనులో పడి యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం జగపతినగరానికి చెందిన వాసంశెట్టి వెంకటరమణ తన కుటుంబసభ్యులు 15మందితో బుధవారం అన్నవరం సత్యదేవుడి దర్శనానికి వచ్చారు. ముందు పంపా రిజర్వాయిర్‌కు చేరుకున్న వారిలో ముగ్గురు యువకులు స్నానానికి దిగారు. వీరిలో వాసంశెట్టి చరణ్ తేజ (16) కాలు జారి ఇటీవల సత్యదేవుడి కల్యాణోత్సవాల్లో చక్రస్నానం కోసం ఏర్పాటుచేసిన కొలనులో జారి పడి ఈత రాకపోవడంతో ఊపిరాడక మృతిచెందాడని అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ఆసుపత్రికి త రలించి కేసు నమోదు చేశామన్నారు. ఘటనా స్థలాన్ని దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు పరిశీలించారు.

స్వగ్రామానికి బద్దే రాజేంద్రప్రసాద్ మృతదేహం



వీరన్నమెరకకు చేరిన రాజేంద్రప్రసాద్ మృతదేహం

అమలాపురం, మే 28(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అల్లవరం మండలం వీరన్నమెరకకు చెందిన బద్దే రాజేంద్రప్రసాద్ మృతదేహాన్ని బుధవారం స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఒమన్‌లో ఉంటున్న తన భర్త రాజేంద్రప్రసాద్ చనిపోయాడని అంటున్నారని, పూర్తి వివరాలు తెలియడం లేదని కలెక్టరేట్‌లో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌కు భార్య బద్దే సుధ ఇటీవల వివరించింది. దాంతో సెంటర్ అధికారులు ఏపీ ఎన్నార్టీ ద్వారా భారత రాయబారి కార్యాలయాన్ని సంప్రదించారు. పూర్తిగా విచారించిన అనంతరం భారత రాయబారి కార్యాలయం రాజేంద్రప్రసాద్(పాస్‌పోర్టు నంబరు వి9142120) మరణాన్ని ధ్రువీకరించారు. ఒమన్ రాజ్యంలోని సూర్ పట్టణంలో నసీర్, అబ్దుల్లా, సయ్యద్, ఖమిస్, అల్‌అరైమి స్పాన్సర్‌షిప్‌లో రాజేంద్రప్రసాద్ ఉండేవాడని, ఈ నెల 20న చేసుకున్నట్టు వివరించారు. రాజేంద్రప్రసాద్ మృతదేహాన్ని దేశానికి తరలించేందుకు స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించాయి. దాంతో బుధవారం కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ప్రతినిధులు రాజేంద్రప్రసాద్ మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చారు.

లారీ ఢీకొన్న ఘటనలో చిరతపూడి వాసి మృతి


ముసలయ్య (ఫైల్)

అంబాజీపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి తిరిగొస్తుండగా లారీ ఢీకొన్న సంఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న చిరతపూడి వాసి మామిడిశెట్టి వెంకటపతి (ముసలయ్య)(58) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈనెల 21న భద్రాచలం స్వామివారి దర్శనం చేసుకున్న కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం చిరతపూడి వస్తున్న సమయంలో కొత్తగూడెం వద్ద బొగ్గులారీ కారును ఢీకొనడంతో కనకదుర్గ, వెంకటరత్నం మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రగాయలైన ముసలయ్య, కోడలు జ్యోతిస్వరూప, మనవులు దీక్షిత, చేతన్లు చికిత్స పొందుతున్నారు. విజయవాడ మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముసలయ్య బుధవారం మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికే ముసలయ్య భార్య కనకదుర్గ, కుమారుడు వెంకటరత్నం మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ముసలయ్య మృతితో ఆ ప్రాంతం శోకసంద్రంలో మునిగిపోయింది.

కూనవరం మండలంలో గాలివాన బీభత్సం

నాలుగు పశువుల మృతి

కూనవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కుంభవృష్టి కురవటంతో ప్రజలు భయాందోళన చెందారు. 3 గంటలు ఏకధాటిగా వర్షం కురిసింది. 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉరుములు, మెరుపుల కారణంగా ఇళ్లల్లోని విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. కొంతమంది ఇళ్లల్లో ఫ్యాన్లు, విద్యుత్ మీటర్లు, ఇన్వెటర్లు కాలిపోయాయి. మండలంలోని టేకుబాక గ్రామంలో గాలివాన కారణంగా విద్యుత్ వైర్లు పడిపోవడంతో 4 పశువులు మరణించాయి.


టేకుబాక గ్రామంలో మరణించిన పశువులు

వ్యాన్‌పై నుంచి జారిపడి ఇద్దరు గిరిజనులకు తీవ్రగాయాలు

వై.రామవరం, మే 28(ఆంధ్రజ్యోతి): ఓ శుభకార్యానికి వెళ్లి వస్తూ వ్యాన్‌పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఇద్దరు గిరిజనులు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. అల్లూరి జిల్లా వై.రామవరం మండలం పి.ఎర్రగొండకు చెందిన కెచ్చల రామకృష్ణారెడ్డి, పల్లాల శ్రీనివాసరెడ్డిలు మరికొంతమందితో చామగడ్డ పంచాయితీ సింగవరంలో జరిగిన రజస్వల ఫంక్షన్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బొలెరో వ్యానులో వస్తుండగా వేగంగా నడపడంతో కుదుపులకు రాచపాలెం- పనసలపాలెం మధ్య ఇద్దరు జారి కింద పడిపోగా తలలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని వై.రామవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో రాజమహేంద్రవరం ప్ర భుత్వాసుపత్రికి రిఫర్ చేసినట్టు ఆసుపత్రి సూపరింటిండెంట్ రాహుల్,డాక్టర్ జీవన్ పేర్కొన్నారు.


తీవ్రంగా గాయపడిన రామకృష్ణారెడ్డి

వంటింట్లోకి దూరి.. అర్ధరాత్రి బంగారం కాజేసి..

ఇంట్లో కుటుంబం నిద్రిస్తుండగా చోరీ

కాకినాడ జిల్లా తిమ్మాపురంలో ఘటన


చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తిమ్మాపురం పోలీసులు

సర్పవరం జంక్షన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో కుటుంబ సభ్యులంతా నిద్రపోతున్నారు. వంట గది కిటికీలోంచి తలుపునకు వేసిన గడియ తీసి ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళం తీసి దర్జాగా రూ.3 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకుపోయిన సంఘటన తిమ్మాపురంలో జరిగింది. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం పంచాయతీ సమీపంలోని రామకృష్ణనగర్‌లో కాంట్రాక్టర్ ముదునూరి సుబ్బరాజు నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి భార్యభర్తలు ఒక గదిలో, కుమార్తె మరో గదిలో నిద్రించారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కుక్కలు అరిచిన శబ్దానికి కుమార్తె లేచి చూడగా ఎవరో పారిపోతున్నట్టు గుర్తించి తల్లిదండ్రులను నిద్ర లేపింది. వారు నిద్రలేచి చూడగా బీరువా తలుపు తెరిచి ఉన్నాయి. కంగారుగా వస్తువులను పరిశీలించగా చోరీకి గురైనట్టు గుర్తించి తిమ్మాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు ఎస్ఐ ఆర్‌వీఎస్ మూర్తి సిబ్బందితో కలిసి చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. నిందితులు వంట గది పక్కన ఉన్న కిటికీలో నుంచి గడియ వేసేందుకు వినియోగించిన చిలుకను చాకచక్యంగా తీసి ఇంట్లోకి ప్రవేశించారు. అక్కడ గదిలో ఉన్న బీరువా తాళాలతో బీరువా లాకర్‌లో ఉంచిన సుమారు రూ.3 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను తీసుకుని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి సీఐ బి.పెద్దిరాజు ఆదేశాలతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మూర్తి తెలిపారు. చోరీ జరిగిన తీరును పరిశీలించి నిందితుల ఆచూకీ కోసం క్లూస్ టీమ్, పోలీసు జాగిలాలను రప్పించారు. వంట గదికి తాళం వేయకుండా గడియ పెట్టడంతో నిందితుడు కిటికీలో నుంచి సులువుగా గడియతీసి చోరీకి పాల్పడినట్టు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్టు ఎస్ఐ తెలిపారు. ఇంట్లో నిద్రలో ఉండగా భార్యభర్తలపై మత్తు మందు చల్లి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

తిరుపతి వెళ్తే ఇల్లు దోపిడీ

రఘునాథపురంలో

బంగారం, వెండి ఆభరణాల అపహరణ

రాజానగరం, మే 28(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రఘునాథపురంలోని ఓ ఇంట్లో దొంగలు ప్రవేశించి విలువైన బంగారు ఆభరణాలు, వెండి సామగ్రిని అపహరించారు. గ్రామానికి చెందిన బల్లి వెంకటేశులు ఈనెల 25న బంధువులతో కలిసి తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులతో పాటు నగదును దోచుకున్నారు. 26న ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన ఎదురింటి వాళ్లు వెంకటేశులుకు ఫోన్‌లో సమాచారం అందించారు. ఇంటికి వచ్చి చూసేసరికి బీరువాలో భద్రపర్చిన బంగారు లాకెట్, హారం, ఉంగరాలు, వెండి కంచం, చెంబు, కుందులతో పాటు కొంత నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మొత్తం 64 గ్రాముల బంగారం, 850 గ్రాముల వెండి అపహరించినట్టు నిర్ధారించారు. వీటి విలువ రూ.1.77 లక్షలు ఉంటుందని అంచనా వేసినట్టు ఎస్ఐ నాగార్జున తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

రేపు రత్నగిరిపై యోగాంధ్ర

తెలుపురంగు వస్త్రాలు ధరించి

హాజరుకావాలి : ఈవో

అన్నవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని పర్యాటకశాఖ ఆధ్వర్యంలో యోగాంధ్రలో భాగంగా కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శుక్రవారం భారీస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఈవో సుబ్బారావు, పీఆర్వో కృష్ణారావు పరిశీలించారు. శుక్రవారం గ్రామస్థులు, అన్నవరం దేవస్థానంలో పనిచేస్తున్న పురోహితులు, నాయీబ్రాహ్మణులు, ఇతర ఉద్యోగులందరూ ఆలయ ప్రాంగణంలో వార్షిక కల్యాణవేదిక వద్దకు ఉదయం 7 నుంచి 9వరకు జరిగే యోగా కార్యక్రమాలకు తెలుపురంగు వస్త్రాలు ధరించి హాజరుకావాలని ఈవో కోరారు.

ప్రసాదం కౌంటర్లో మద్యం తాగి ఉద్యోగి విధులు

చర్యలకు ఆదేశించిన అధికారులు

అన్నవరం దేవస్థానం కొండ దిగువన ప్రసాదం కౌంటర్లో ఒక ఉద్యోగి మద్యం తాగి విధులు నిర్వహించడంతో అతడిపై చర్యలకు అధికారులకు ఆదేశించారు. వివరాల్లోకి వెళితే సన్నిధి విభాగానికి చెందిన ఈశ్వరసాయి పృథ్వీతేజ బుధవారం టిక్కెట్ కౌంటర్లో విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ప్రసాదం కొనుగోలు కోసం విచ్చేసిన భక్తుడితో వాగ్వాదానికి దిగడంతో అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అతడికి బ్రీత్‌ఎన్‌లైజర్ పరీక్షలు నిర్వహించి మద్యం తాగినట్టు గుర్తించి విధుల నుంచి ఇంటికి పంపించారు. దీనిపై నివేదిక ఇచ్చినట్టు సన్నిధి విభాగ సూపరింటెండెంట్ యనమల అప్పారావు తెలిపారు.

మహిళ మెడలో గోల్డ్‌చైన్ లాక్కుని పరారీ

పిఠాపురం, మే 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో మహిళ మెడలో బంగారు చైన్ లాక్కుని దుండగులు పరారయ్యారు. పట్టణంలోని ఆర్డీసీ కాంప్లెక్సు సమీపంలో నివాసముంటున్న యాళ్ల సుజాత మంగళవారం రాత్రి జగ్గంపేట చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొని తిరిగి ఇంటికి వస్తోంది. ఆ సమయంలో కారులో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు తన మెడలో ఉన్న నాలుగు కాసుల బంగారు చైన్‌ను లాక్కుని పరారైనట్టు సుజాత పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

గంజాయితో ఏడుగురి అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రావులపాలెం పోలీసులు

రావులపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి): గంజాయితో ఏడుగురిని అరెస్ట్ చేసినట్టు రావులపాలెం పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఐబలంక ఏటిగట్టు పక్కన రావిచెట్టు వద్ద అనుమానస్పందంగా ఏడుగురు వ్యక్తులు సంచరిస్తున్నట్టు సమాచారం వచ్చింది. దీంతో డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో సీఐ ఎం.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ నాయుడు రాము సిబ్బందితో అక్కడికి వెళ్లి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.ఊబలంకకు చెందిన సత్తి భాస్కరవీరరెడ్డి, పసంగి సింహాద్రి, రావులపాలానికి చెందిన శిరిగినీడి పవన్, సత్తి వీర సత్యసాగర్ రెడ్డి, ఆత్రేయపురం మండలం మెర్లపాలానికి చెందిన వాసంశెట్టి చంద్రమౌళి, రావులపాలానికి చెందిన మల్లిడి కిరణ్‌రెడ్డి, ఆత్రేయపురం మండలం ర్యాలికి చెందిన మామిడిపల్లి నాగరాజులను అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి తాగడంతో పాటు అమ్మకానికి ప్రయత్నిస్తున్నట్టు తెలిసిందన్నారు. దీంతో రూ.5వేలు విలువైన 500 గ్రాముల గంజాయిని వారి నుంచి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

చింతూరులో ఇద్దరు...


చింతూరు బస్‌స్టేషన్ వద్ద పట్టుబడ్డ నిందితులు

చింతూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు బుధవారం గంజాయితో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ రమేష్ కథనం మేరకు.. వాహన తనిఖీలు చేస్తుండగా బస్ స్టేషన్ వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా కన్పించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా వారి వద్ద 30కిలోల గంజాయి పట్టుబడింది. చిత్తూరు జిల్లాకు చెందిన గుండ్లఘటం రవిచంద్రన్ విజయ్, కండిగ రాజశేఖర్ ఒడిస్సాలో గంజాయి కొనుగోలు చేసి వయా చింతూరు మీదుగా తమిళనాడుకు గంజాయి తరలించే క్రమంలో పట్టుబడినట్టు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1,50,000 ఉంటుందన్నారు. తహశీల్దార్ చిరంజీవి, వీఆర్వోలు సోడె సుబ్బారావు, సుజాత సిబ్బంది పాల్గొన్నారు.

'లోవ' హుండీల లెక్కింపులో అటెండర్ చేతివాటం

- రూ.500 నోట్ల కట్ట చోరీ
- సస్పెండ్ చేసిన అధికారులు


సస్పెండ్ అయిన అటెండర్ రమణ

తుని రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో బుధవారం జరిగిన హుండీల ఆదాయం లెక్కింపులో దేవస్థానం అటెండర్ ఎల్ఎస్‌వీ రమణ చేతివాటం చూపించాడు. 109 నోట్లు ఉన్న రూ.500 నోట్ల కట్టను దొంగిలించినట్టు సమాచారం అందడంతో ఆలయ అధికారులు సీసీ కెమెరాలను పరిశీలించారు. దీంతో హుండీ డబ్బులు చోరీ చేసినట్టు రుజువు కావడంతో అటెండర్‌ను విధుల నుంచి తొలగించారు. అతడిపై రూరల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయనున్నట్టు ఈవో తెలిపారు. అయితే హుండీల లెక్కింపు జరిగే ప్రాంతంలో సంబంధిత ఉద్యోగి తప్పించుకునే ప్రయత్నంలో కింద పడినట్టు తెలిసింది. దీంతో స్వల్ప గాయాలు కాగా ఆలయ అధికారులు ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు సమాచారం. లెక్కింపులో వివిధ విభాగాల ద్వారా రూ.42,28,836 ఆదాయం సమకూరినట్టు ఉప కమిషనర్, లోవ కార్యనిర్వహణాధికారి టి.విశ్వనాధరాజు పేర్కొన్నారు.

అమలాపురం

ఎమ్మెల్యే దేవ పరామర్శ

రాజోలు, మే 28(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలం రావిలంక గోదావరిలో గల్లంతై మృతి చెందిన ముగ్గురు యువకుల మృతదేహాలను బుధవారం రాజోలు సామాజిక ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆసుపత్రి వద్ద బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు.

'పైపులైన్ లీకేజీని సరిచేయండి'

మామిడికుదురు, మే 28(ఆంధ్రజ్యోతి): నగరం తాడివారిమెరకలో తాగునీటి పైపులైన్‌లో ఏర్పడిన లీకేజీని సరి చేయాలంటూ స్థానికులు కోరుతున్నారు. 20రోజులుగా పైపులైను లీకేజీ ఏర్పడిందని, తాగునీరు పంపిణీ సమయంలో నీరు వృథా అవుతుందని తెలియజేస్తున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలంటూ స్థానికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు



ఐ.పోలవరం: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ముమ్మిడివరం, మే28(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధి సలాదివారిపాలెంలో స్నానానికి దిగిన 11 మందిలో ఎనిమిది మంది గల్లంతు కాగా ఏడు మృతదేహాలు మంగళవారం లభ్యం కాగా ఎనిమిదో మృతదేహం బుధవారం సబ్బతి క్రాంతి మాన్యువల్ (19) లభ్యమైంది. క్రాంతి మృతదేహాన్ని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పరిశీలించి, ఆవేదన వ్యక్తం చేశారు. సరదాగా స్నానానికి దిగిన విద్యార్థులు మృత్యువాత పడడం ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చిందన్నారు. మహానాడులో ఉండడం వల్ల తాను రావడం ఆలస్యమైందని, అయితే ఈవిషయంపై ముఖ్యమంత్రి, కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడానన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటానన్నారు. గల్లంతైన వారికోసం వేగంగా స్పందించి 40గంటలు శ్రమించి మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టానికి తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించడంలో పోలీసు, రెవెన్యూ, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమన్నారు. గతంలో సలాదివారిపాలెంలో పడవ బోల్తా సంఘటనలో పలువురు మృతిచెందారని, మళ్లీ అటువంటివి చోటు చేసుకోకూడదనే లంక గ్రామాల ప్రజల కోసం వారధి నిర్మాణం చేపట్టామన్నారు. అయితే మరలా ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఐ.పోలవరం, మే 28(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం కమిని వద్ద గోదావరిలో మృతిచెందిన వారి కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఎర్రగరువుకు చెందిన అన్నదమ్ములు వడ్డి మహేష్, రాజేష్‌లు గోదావరిలో మునిగి మృతి చెందారు. బాధిత కుటుంబాలను బుధవారం ఆయన పరామర్శించారు. తండ్రి భైరవస్వామిని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేప్రాంతంలో రెండు సార్లు ఘోరం జరగడం దురదృష్టకరమన్నారు. అన్నదమ్ముల చిత్రపటాలకు నివాళులర్పించారు. టీడీపీ నాయకులు తాడి నరసింహారావు, కాకర్లపూడి రాజేష్, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, సంగాని వీరబాబు, పోతుల సూర్య ఉన్నారు.

సినిమా థియేటర్ల తనిఖీ



అంతర్వేది: వీవీమెరక శంకర్ థియేటర్‌ను తనిఖీచేస్తున్న తహశీల్దార్ వెంకటేశ్వరరావు

ముమ్మిడివరం, మే 28(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని సినిమా థియేటర్లను తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. సినిమాటోగ్రఫీ చట్టాలకు అనుగుణంగా సినిమా హాళ్లు నిర్వహించాలని, ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ముమ్మిడివరంలోని శ్రీకృష్ణ టాకీస్, శ్రీవెంకటేశ్వరా థియేటర్లను ఆమె తనిఖీ చేసి, థియేటర్ లైసెన్సులు, ఫైర్ సేఫ్టీ పరికరాలు, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత వంటి వాటిని నిశితంగా పరిశీలించారు. మరుగుదొడ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా సినిమా థియేటర్లను తనిఖీ చెయ్యాలని ఆదేశాలు ఇచ్చారు. ఈక్రమంలోనే జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు స్థానికంగా ఉన్న శ్రీబాలబాలజీ థియేటర్‌ను తహశీల్దార్ పి.శ్రీపల్లవి తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి థియేటర్‌ను నడుపుతున్నారో లేదో క్షుణ్ణంగా పరిశీలించారు. థియేటర్‌లోని మరుగుదొడ్లు, శానిటేషన్, టిక్కెట్టు ధరలు తదితర అంశాలను నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విషయం పట్టిక రూపంలో ఉండాలని సూచించారు. అలాగే థియేటర్‌లోపల ఉన్న క్యాంటీన్ పరిశీలించి ఎవరు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. అదే విధంగా థియేటర్‌ను నిర్వహించే రికార్డులను చూపాలని అడగగా అంతా ఆన్‌లైన్‌లో ఉంటుందని నిర్వహకులు బదులిచ్చారు. తహశీల్దార్ వెంట ఆర్ఐ డాంగే, వీఆర్వో కోరుకొండ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మలికిపురంలో ఉన్న సినిమా థియేటర్లను తహశీల్దార్ టి.శ్రీనివాసరావు తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం అన్ని సదుపాయాలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): వీవీమెరక గ్రామంలో ఉన్న శంకర్ థియేటర్‌ను సఖినేటిపల్లి తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. థియేటర్ యజమానులతో కలిసి టిక్కెట్ కౌంటర్, క్యాంటీన్, థియేటర్ రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. సినిమా యాక్టు 1970 ప్రకారం సక్రమంగా థియేటర్ నిర్వహణ జరగాలని ఆహార పదార్థాలు, టిక్కెట్ల అమ్మకం, టాయిలెట్లు తదితర అంశాలపై యాజమాన్యంతో మాట్లాడారు. డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐ రామరాజు, ఏఆర్వో పాల్గొన్నారు.

సాయిగాయత్రికి సాయం

అంతర్వేది, మే 28(ఆంధ్రజ్యోతి): గొంది గ్రామానికి చెందిన శ్రీకనకముత్యాలమ్మవారి యూత్ ఆధ్వర్యంలో అత్తిలి సాయిగాయత్రికి కిడ్నీమార్పిడి అనంతరం వైద్య ఖర్చుల కోసం రూ.1,47,509ను కాకినాడలోని ఆసుపత్రికి వెళ్లి అందించినట్టు కనకముత్యాలమ్మ యూత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గొంది సర్పంచ్ దొండపాటి రవికుమార్, ఉపసర్పంచ్, నీటిసంఘం ఉపాధ్యక్షుడు ఆకన బాబ్జినాయుడు, రావూరి నాగు, అయినపర్తి ఏసు, నేదునూరి సత్తిబాబు, ముత్యాలమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి గౌరవాన్ని నిలిపిన ఎన్టీఆర్

- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ
- ఎన్టీఆర్ జయంతి వేడుకలు







పి.గన్నవరంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి, ముమ్మిడివరం: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, రాజోలు: కేక్ కటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే దేవ

పి.గన్నవరం, మే 28(ఆంధ్రజ్యోతి): అన్న ఎన్టీఆర్ తెలుగు సినీ రంగానికి వన్నెతేవడంతో పాటు సామాన్యుడికి సైతం రాజకీయాలను తెలియజెప్పారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో స్థానిక నాయకులు కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. స్థానిక గ్రంథాలయం వద్ద గ్రంథాలయ అధికారి జి.రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో ఎంపీడీవో కేవీ ప్రసాద్ పాల్గొని నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నీటి సంఘం డిస్ట్రిబ్యూటర్ ఉపాధ్యక్షుడు చొల్లంగి సత్యనారాయణమూర్తి, కె.సత్యనారాయణ రాజు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, రాణి శ్రీనివాసశర్మ, గుత్తుల రామకృష్ణ, గనిశెట్టి ఈశ్వర్, ఆదిమూలం సూరయ్యకాపు, తవిటికి బుజ్జి, పరమట సత్యనారాయణ, దొమ్మేటి వెంకటేశ్వరరావు, మల్లాడి గోపి, వేమన రామకృష్ణ, బండారు చిన్న పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌తో తెలుగువారి కీర్తి విశ్వవ్యాప్తం

అమలాపురం టౌన్/రూరల్, (ఆంధ్రజ్యోతి): తెలుగువారి కీర్తిని విశ్వవ్యాప్తం చేయడంతో పాటు మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించిన ఘనత టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావుకు దక్కుతుందని టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా పేర్కొన్నారు. పట్టణంలోని అన్నివార్డుల్లో టీడీపీ పతాకాలను ఆవిష్కరించడంతో పాటు గడియారస్తంభం సెంటర్, నల్లవంతెన, హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు నల్లా స్వామి, గంధం శ్రీను, కర్రి రామస్వామి, నల్లా మల్లిబాబు, బోనం సత్యవరప్రసాద్, దున్నాల బాబి, వలవల శివరావు, భాస్కర్ల రామకృష్ణ, నల్లా చిట్టిబాబు, ముత్యాల గంగాధర్ పాల్గొన్నారు. బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి మండలశాఖ అధ్యక్షుడు సత్యసాయిబాబా పూలమాలలువేసి నివాళులర్పించారు. గ్రామకమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పెనుమాల సునీత, మాజీ ఎంపీటీసీలు ఆశపు చిన్నీ, బండి సుబ్బారావు, కడలి వెంకటేశ్వరరావు, బళ్ల వెంకటేశ్వరరావు, కండిబోయిన సూర్య, యాళ్ల సుబ్బలక్ష్మి, కొండా రాజు, మాడా పద్మదుర్గాప్రసాద్, బళ్ల శ్రీనివాసచక్రవర్తి, కాశిన బాబి, చింతా బాస్ తదితరులు పాల్గొన్నారు. కామనగరువులో ఎన్టీఆర్‌విగ్రహానికి బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు) పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బొంతు బాలరాజు, రాజులపూడి మహేశ్వరరావు, దొమ్మేటి ఆదిబాబు, దాసరి సాయిబాబు, మట్ట బుజ్జి, జంగా మోహన్, దాసరి చంటి, అత్తిలి విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని టౌన్‌వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఇమ్మిడివరప్పాడులోని మదర్‌థెరిసా అనాధాశ్రమంలో కేక్‌ను కట్‌చేశారు.

స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ రాయుడు బాబ్జికుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మట్టపర్తి రాము, జిల్లా ఆర్గనైజర్ కొపనాతి వెంకటరాజు, ఓలేటి రాంబాబు, మిద్దే దుర్గాప్రసాద్, అయినవిల్లి శ్రీనివాసరావు, మట్ట నాగబాబు, రాయుడు ఈశ్వరరావు, కుడుపూడి శ్రీనివాసరావుపాల్గొన్నారు.

తొమ్మిది నెలల్లో అధికారం

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 102వ జయంతిని ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆధ్వర్యంలో స్థానిక పోలమ్మ చెరువుగట్టున ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. స్థానిక కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎన్టీఆర్ 1982లో టీడీపీని స్థాపించి తొమ్మిది నెలల కాలంలోనే కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించిప్రభుత్వాన్ని స్థాపించారన్నారు. పేదవాడికి తిండి, బట్ట, గూడు కల్పించాలనే లక్ష్యంతో మొట్టమొదటిగా సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అమలు చేయడంలో ఎన్టీఆర్ ఖ్యాతిని అర్జించారన్నారు. దొమ్మేటి రమణకుమార్, తాడి నరసింహారావు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, ములపర్తి బాలకృష్ణ, గొల్లపల్లి గోపి, విళ్ల వీరాస్వామినాయుడు, జగతా గోవిందు, నడింపల్లి శ్రీనురాజు, దాట్ల బాబు, జనిపల్లి సత్యనారాయణ, బొక్కా రుక్మిణి, మెండి కమల, వాసంశెట్టి అమ్మాజీ, కొండేటి వెంకటలక్ష్మి, కుడుపూడి మల్లేశ్వరి, అత్తిలి లక్ష్మీప్రసన్న, సత్తి నూకరాజు, పొత్తూరి శివరామకృష్ణంరాజు, కాశి లాజర్, బీర శివ, రెడ్డి సుబ్బారావు, బూరుగ కల్యాణ్, పితాని నరసింహమూర్తి, రాయుడు శ్రీను, చింతపల్లి రాజు, మాదాల పరంకుశం పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట పుల్లేటికుర్రు, కె.పెదపూడి, నందంపూడి గ్రామాల్లో విగ్రహాలతో పాటు ఆయన చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, కూటమి పార్టీ నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, పెదపూడి శ్రీనివాస్, అరిగెల బలరామమూర్తి, మైపాల తాతాజీ, కొప్పినీడి ఈశ్వరరావు, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, దాసరి శ్రీనివాసరావు, మందా రాజేష్, దొమ్మేటి శ్యామ్, అధికారపు బాబ్జి, కమిడి అబ్బు, కాసా నాగమల్లేశ్వరరావు, పాల్గొన్నారు. పుల్లేటికుర్రులో ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వక్కలంక బుల్లియ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, గోడా వెంకట్రావు, వీరా రవి, బొరుసు రాజా తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఖ్యాతిని ప్రపంచానికి చాటారు

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఔన్నత్యాన్ని ప్రపంచానికి నందమూరి తారక రామారావు చాటిచెప్పారని టీడీపీ నాయకులు కొనియాడారు. మామిడికుదురు బస్టాండు కూడలిలో బుధవారం ఎన్టీఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి పంచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నయినాల సత్యనారాయణమూర్తి, మెండా వెంకటేశ్వరరావు, వాసంశెట్టి వెంకట్రావు, యింటి గణపతిరావు, బండారు వెంకటేశ్వరరావు, కంచి రవి, బాలం శ్రీను, బీజేపీ నాయకుడు నక్కా త్రిలోచనరావు పాల్గొన్నారు.

కడపలో వేడుకలు

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): ఎన్టీ రామారావు కారణ జన్ముడని పలువురు వక్తలు పేర్కొన్నారు. దిండి వై-జంక్షన్‌లో, గుడిమెళ్లంకలో గల ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముదునూరి చినబాబు, గెడ్డం సింహ, బందెల పద్మ, గోనిపాటి రాజు, రాపాక ఆనంద్‌కుమార్, ఎం.శ్రీనివాస్‌లు గుడిమెళ్లంకలో అడబాల సాయిబాబు, చెల్లింగి సత్యనారాయణ, బొరుసు ఉమారావు, రాపాక నవరత్నం, ముత్యాల శ్రీను, కట్టా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎన్టీఆర్ జయంతిని రాజోలు నియోజకవర్గ టీడీపీ నాయకులు బుధవారం కడపలో నిర్వహించారు. మహానాడుకు వెళ్లిన నాయకులు కడప సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి ఎన్టీఆర్

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ నందమూరి తారకరామావు నిరుపేదల పెన్నిధి అంటూ తెలుగుదేశం కార్యకర్తలు నినదించారు. ఎన్టీఆర్ జయంతిని బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లోను ఘనంగా జరుపుకున్నారు. గొల్లవిల్లి సెంటర్, ఉప్పలగుప్తం బాలయోగి పార్కులో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొల్లవిల్లిలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, సర్పంచ్ నల్లా బాబండి, పార్టీ ప్రధాన కార్యదర్శి పండు వెంకటేశ్వరరావు, గుత్తుల నాగేశ్వరరావు, మద్దింశెట్టి సీతారామస్వామి, గొలకోటి సత్తిరాజు, నిమ్మకాయల పద్మావతి, కాగిత సత్యనారాయణ, చిక్కం కాసు, అడబాల సత్యనారాయణ, గుర్రాల ప్రసాద్, చీకట్ల ఏసు, నందుల సత్తిరాజు, కాశిన సత్యనారాయణ, సలాది పట్టాభి, లంకే శ్రీనివాస్, మల్లాడి వెంకటరమణ, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, ఆకుల వెంకటరమణ, గెడ్డం సత్యనారాయణ, ఆకేటి పెద్ద, మధుర ప్రతాప్, గనిశెట్టి రాము, చప్పిడి వెంకటేశ్వరరావు(కిరణ్), మంచెం బుజ్జి పాల్గొన్నారు. చల్లపల్లి, గోపవరం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎన్.చెల్లయ్యానాయుడు, పోలిశెట్టి శివాజీ, సుంకర రాంబాబు, దంగేటి రవీంద్రనాథ్, ఎన్.లక్ష్మణపేరయ్యానాయుడు, కొల్లు పెద్దిరాజు పాల్గొన్నారు.





ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు, అమలాపురంలో టీడీపీ పతాకాన్ని ఆవిష్కరించిన నాయకులు

అయినవిల్లిలో నివాళి

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఖ్యాతిని ప్రపంచానికి చాటిన ధీరుడు ఎన్టీఆర్ అని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అయినవిల్లిలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కారణజన్ముడు

రాజోలు, (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ఎన్టీఆర్ కారణ జన్ముడని, తెలుగువారి ఆత్మగౌరవం కోసం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లో ముఖ్యమంత్రి అయిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్ మాత్రమేనని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలులో జరిగిన ఎన్టీఆర్ 102వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలు ఏర్పాటుచేసిన కేక్‌ను ఎమ్మెల్యే దేవ, మాజీ డిప్యూటీ స్పీకర్ అల్లూరి వెంకటసూర్యనారాయణరాజు కట్‌చేసి అందరికీ పంచారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గేదెల వరలక్ష్మి, జగడం సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, కసుకుర్తి త్రినాథస్వామి, గుబ్బల కుమార్, పాముర్తి రమణ, కోళ్ల వెంకన్న, కట్టా సూరిబాబు, ఈలి శ్రీనివాస్, వర్ధినీడి బాబ్జి, ఆరుమిల్లి సాయిబాబు, కొత్తపల్లి విజయలక్ష్మి, కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు. రాజోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్‌లు పూలమాలలువేసి నివాళులర్పించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది,ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, కుట్టుశిక్షణ కేంద్రం మహిళలు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ముమ్మిడివరం, మే 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఈ నెల 31న ముమ్మిడివరం నియోజకవర్గంలో పర్యటించనున్న సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు బుధవారం రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. సీహెచ్ గున్నేపల్లిలో ఓఎన్జీసీ సైట్‌లో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని, బహిరంగ సభ వద్ద ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సీఎం చంద్రబాబు పేదలసేవ-బంగారు కుటుంబం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఉపాధి కూలీలతో చంద్రబాబు ముఖాముఖి మవుతారని, గ్రామంలో పింఛనుదారులకు పెన్షన్లు అందిస్తారన్నారు. గ్రామస్తులతో బహిరంగ సభ, నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశమవుతారన్నారు. సీఎం పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేసి నియోజకవర్గ ప్రధాన సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీవో కె.మాధవి, కాకర్లపూడి రాజేష్, తాడి నరసింహారావు, నాగిడి నాగేశ్వరరావు, కాకర్లపూడి రాజేష్, నడింపల్లి సుబ్బరాజు, త్సవటపల్లి నాగు తదితరులు ఉన్నారు.

పరామర్శ

రాజోలు, మే 28(ఆంధ్రజ్యోతి): కడలిలో విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి మేడిద రత్నకుమారి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. రత్నకుమారి భర్త రాజారావు, కుమారులు శ్రీరామ్, ప్రసాద్, కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ స్పీకర్ అల్లూరి వెంకటసూర్యనారాయణరాజు పరామర్శించి ఓదార్చారు. అనంతరం రత్నకుమారి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది యాలంగి రమేష్, రాధాకృష్ణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు తోట సురేష్‌కుమార్, డాక్టర్ యాలంగి పతయ్య, మాజీ సర్పంచ్ గోసంగి స్టాలిన్‌బాబు, గోసంగి పల్లయ్య, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది పరామర్శించిన వారిలో ఉన్నారు.

సాథీ ద్వారా అనాథ పిల్లలకు ఆధార్ నమోదు

రాజోలు, మే 28(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సాథీ (సర్వే ఫర్ ఆధార్ అండ్ యాక్సెస్ టూ ట్రాకింగ్ హోలిస్టిక్ ఇంక్లూసన్) ద్వారా నిరాశ్రయులు, అనాథపిల్లలను గుర్తించి వారికి ఆధార్ సీడింగ్ నమోదు చేయించి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చేసేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేసినట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.ప్రమీలారాణి తెలిపారు. రాజోలు కోర్టు చాంబర్‌లో సాథీ కార్యక్రమంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రాజోలు కోర్టు పరిధిలో మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు మండలాల్లో జూన్ 26వ తేదీ వరకు సాథీ ఇంటింటా సర్వే జరుగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏజీపీ గుబ్బల రజిత, రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 56మందికి ఉద్యోగాలు

యానాం, మే 28(ఆంధ్రజ్యోతి): యానాం ప్రభుత్వ ఐటీఐలో బుధవారం తమిళనాడు రాష్ట్రం కాంచీపురం ఎల్అండ్‌టీ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణాసుధాకర్ తెలిపారు. ఎల్అండ్‌టీ ప్రతినిధి కాంతారావు పాల్గొన్నారు. ప్రభుత్వ ఐటీఐలో ఫైనల్ ఇయర్ చదువుతోన్న వైర్‌మెన్, మోటార్ మెకానిక్ విద్యార్థులు 36మంది, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఇతర ట్రేడ్స్ నుంచి శిక్షణ ముగించుకున్న 20మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రతినిధులు వి.ఆనంద్, లంక ప్రసాదరావు, యాళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా నిఘా వ్యవస్థ

కలెక్టర్ మహేష్‌కుమార్



మాదకద్రవ్యాల వినియోగంతో జరుగుతున్న నష్టాలను వివరిస్తూ ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు తదితరులు

అమలాపురం టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం మాదక ద్రవ్యాలు, గంజాయి వాడకం నిరోధంపై జిల్లాస్థాయి మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యువతను సన్మార్గంలో నడిపి వారిలో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించి ఉన్నత లక్ష్యాలను చేరుకునే దిశగా ప్రోత్సహించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగ ప్రభావం ఆయా కుటుంబాలను ఏవిధంగా చిన్నాభిన్నం చేస్తుందో వివరిస్తూ ముద్రించిన పోస్టర్లు, పాంప్లేట్లను ఆయన ఆవిష్కరించారు. వాటిని పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, డీఈవో సలీంబాషా, డీపీవో డి.శాంతలక్ష్మి పాల్గొన్నారు.

వారణాశి ఐఐటీలో శ్రీలలిత ప్రవేశం

అమలాపురంటౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): వారణాశిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పీహెచ్‌డీ చేసేందుకు ప్రవేశం పొందిన కర్రా శ్రీలలిత దంపతులను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ బుధవారం అభినందించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, మెషీన్‌లెర్నింగ్ రంగాల్లో పరిశోధన చేయాలనే సంకల్పంతో శ్రీలలిత వారణాశి ఐఐటీలో ప్రవేశం పొందారన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం

పి.గన్నవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): మానేపల్లిలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయానికి వాడ్రేవుపల్లి శివారుచాకలిపాలేనికి చెందిన యిళ్ల శ్రీరామచంద్రమూర్తి, సత్యవేణి దంపతులు రూ.1,01,116 విరాళాన్ని అయ్యప్పస్వామి సేవాసమాజంఅధ్యక్షుడు కె.ప్రకాష్‌స్వామి, అర్చకుడుకు అందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అయినవిల్లిలో యోగాసనాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అయినవిల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో ఉపకరిస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన అయినవిల్లిలో యోగా శిక్షణను ప్రారంభించారు. ఉపాధ్యాయులు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, ఎంపీడీవో సి.వెంకటసరేవర్, డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కాకర శ్రీనివాస్, పోలిశెట్టి రాజేష్, కోన చంద్రశేఖరం, కాశిన వీర వెంకట సత్యనారాయణ, వారా జయసావిత్రి, సలాది బుచ్చిరాజు, కళ్లేపల్లి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా తరగతులు ప్రారంభం

ఐ.పోలవరం, మే 28(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ భద్రకాళీసమేతవీరేశ్వర స్వామి ఆలయంలో బుధవారం యోగా తరగతులు ప్రారంభించారు. యోగాంధ్ర క్యాంపెయిన్-2025లో భాగంగా నెల రోజులు ఈకార్యక్రమం జరుగుతుంది. అనుభవజ్ఞులైన యోగా గురువులు యోగా శిక్షణ ఇస్తారని ఆలయ కమిటీ తెలిపింది. బుధవారం కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, వేదపండితులు, భక్తులు, సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు. ఉచిత ప్రసాద వితరణ జరిగింది.

యోగాతో మానసిక ప్రశాంతత

అంబాజీపేట, మే28(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో భీమరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు. యోగా ఆసనాలను వేయడం ద్వారా ఆరోగ్యపరంగా ప్రయోజనాలు కలుగుతుందన్నారు. జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు మైలా ఆనందరావు, గోసంగి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం

ముమ్మిడివరం, మే 28(ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతీ ఒక్కరూ యోగా చేయాలని ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీలు ఎస్.రాంబాబు, కె.రమాదేవి పాల్గొని శిక్షణ ఇచ్చారు. శరీర ధృడత్వానికి, ఆరోగ్యానికి వృక్షాసనం, వజ్రాసనం తదితర ఆసనాలువేసి చూపించారు. సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా యానిమేటర్లకు యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిపాలనాధికారి బీహెచ్ తులసీకృష్ణ, మండల సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ముమ్మిడివరం, మే 28(ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్‌పై మనమడు, అమ్మమ్మ వెళుతుండగా కారుఢీకొనడంతో అమ్మమ్మ తీవ్రంగా గాయపడింది. బుధవారం ఐ.పోలవరం మండలం గుత్తెనదీవికి చెందిన ఓలేటి చంద్రమ్మ ఆమె మనుమడు భీమన్నతో కలిసి అమలాపురం ఆసుపత్రికి వెళ్తున్నారు. ముమ్మిడివరం మండలం గాడిలంక అంజనేయస్వామి ఆలయ సమీపంలో వెనుక నుంచి వారిని కారు ఢీకొనడంతో చంద్రమ్మ తీవ్రంగా గాయపడింది. భీమన్న స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడినవారిని అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్టు హెచ్‌సీ భైరవస్వామి తెలిపారు.

పశు దాణా పంపిణీ

మలికిపురం, మే 28(ఆంధ్రజ్యోతి): గుడిమెల్లంకలో పాడి రైతులకు 3.5 టన్నుల పశు దాణాను ఎంపీపీ ఎంవీ సత్యవాణి బుధవారం పంపిణీ చేశారు. 50శాతం రాయితీతో రైతులకు పశువుల దాణా అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లి విజయకుమారి, ఎంపీటీసీ నల్లి అంజలీదేవి, డాక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు 330కిలోల దాణా వితరణ

అంతర్వేది, మే 28(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి అనుబంధ ఆలయ గోశాలకు మలికిపురం మండలం మేడిచర్లపాలేనికి చెందిన మంచెం అప్పారావు 280కిలోల దాణాను బుధవారం వితరణ చేశారు. అలాగే అంతర్వేదికి చెందిన చీర్ల రామాంజనేయులు, లక్ష్మీదుర్గ దంపతుల కుమార్తె ధాన్యనందుశ్రీ అన్నప్రాసన, నామకరణ సందర్భంగా 50కిలోల దాణా వితరణ చేశారు. కార్యక్రమంలో సేవాబృందం సభ్యులు జక్కంపూడి మాణిక్యాలరావు, బెల్లంకొండ సూరిబాబు, రావి ప్రసాద్, సర్వేశ్వరరావు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థినుల యోగాసనాలు

యానాం, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం సమావేశపు హాల్‌లో యానాం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాం సందర్భంగా మదర్ థెరిస్సా నర్సింగ్ కళాశాల విద్యార్థునులతో యోగా చేయించారు. ఈసందర్భంగా పరిపాలనాధికారి మునిస్వామి మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఎం.పురుషోత్తం, రవీంద్ర, నర్సింగ్ కళాశాల ఇన్‌ఛార్జి బాపిరాజు వివరించారు. నేచురోపతి వైద్యురాలు డాక్టర్ చంద్రలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ పోస్టులకు 320మంది దరఖాస్తు

యానాం, మే 28(ఆంధ్రజ్యోతి): యానాంలో జిప్‌మెర్ మల్టీ స్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానించడంతో 50నర్సింగ్ పోస్టులకు 320మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని యానాం జిప్‌మెర్ మెడికల్ ఆఫీసర్ అనందరాజు తెలిపారు. రాత పరీక్ష, స్కిల్‌టెస్టు ద్వారా ఎంపిక చేస్తామన్నారు. పుదుచ్చేరిలోని ఉన్నతాధికారులకు జాబితా పంపిస్తామన్నారు.

బ్లడ్ సెంటర్ ప్రారంభం

అమలాపురం టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): అమలాపురం కళాశాల రోడ్డులో యెండూరి రాఘవ నాగేశ్వరరావు బ్లడ్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర బుధవారం ప్రారంభించారు. జిల్లాలో అత్యాధునిక కంప్యూటర్ పరికరాలతో నూతన టెక్నాలజీతో బ్లడ్ సెంటర్‌ను ఏర్పాటుచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అనుభవజ్ఞులైన వారిచే బ్లడ్ సెంటర్ నిర్వహిస్తున్నామన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.34 లక్షలు

ఆత్రేయపురం, మే 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,34,705 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

తాత్కాలిక అన్నదాన షెడ్ పునర్నిర్మాణం: శ్రీనివాస ప్రాంగణంలోని వకుళమాత అన్నదాన భవన నిర్మాణం చెంతనే ఉన్న స్థలంలో తాత్కాలికంగా అన్నదాన షెడ్‌ను నిర్మించారు. ఇటీవల భారీ వర్షాలు, ఈదురుగాలులకు కుప్పకూలింది. ఈ నేపథ్యంలో తాత్కాలిక అన్నదాన షెడ్ పునర్నిర్మాణం చేపడుతున్నారు. ఆయా పనులను ఉపకమిషనరు పరిశీలించారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు



రామచంద్రపురంలో సినిమా థియేటర్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో అఖిల, తహశీల్దార్ ముత్యంజయరావు

ద్రాక్షారామ, మే 28(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని రాజగోపాల్ థియేటర్‌ను బుధవారం రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల తనిఖీలు చేశారు. థియేటర్‌లోని సదుపాయాలు, రికార్డులను ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ముత్యంజయరావు, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): సినిమా హాల్స్‌లో ప్రభుత్వ నిబంధనలను పాటించాలని రావులపాలెం తహశీల్దారు ముక్తేశ్వరరావు అన్నారు. రావులపాలెంలోని అక్షర థియేటర్‌లోని సౌకర్యాలను సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ సుజాత, వీఆర్వో రవిశంకర్ పాల్గొన్నారు.

సినిమా హాల్ తనిఖీ

రాయవరం, (ఆంధ్రజ్యోతి): రాయవరం రాయల్ టాకీస్ సినిమా థియేటర్‌ను బుధవారం తహశీల్దారు ఐపీ శెట్టి తనిఖీ చేశారు. టిక్కెట్ ధరలు, తినుబండారాల ధరలు, టాయిలెట్స్‌లో సౌకర్యాలు తదితర పలు అంశాలను పరిశీలించారు. జేసీ ఆదేశాలపై థియేటర్‌ను తనిఖీ చేసినట్టు తహశీలారు తెలిపారు.



రాయవరంలో రాయల్ టాకీస్‌ను తనిఖీ చేస్తున్న తహశీల్దారు శెట్టి



రావులపాలెం అక్షర థియేటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న తహశీల్దారు ముక్తేశ్వరరావు

విద్యార్థినులకు శుభ్రతపై అవగాహన



మాచరలో అవగాహన కల్పిస్తున్న శ్రమ స్వచ్ఛంద సంస్థ

కపిలేశ్వరపురం, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచర గ్రామంలో కిషోర బాలికలకు, తల్లులకు పలు అంశాలపై శ్రమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచ రుతుశ్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శ్రమ కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎం.భవాని, అంగన్‌వాడీ టీచర్ పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా హార్మోన్స్ తదితర పలు అంశాలపై బాలికలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కన్నతల్లిపై ఉందన్నారు. కార్యక్రమంలో కిషోర బాలికలు, తల్లులు, అంగన్‌వాడీ, శ్రమ టీం సభ్యులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

కె.గంగవరం, మే 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల గోదావరిలో స్నానాలకు దిగి ఎనిమిది మంది ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటన కూళ్ల సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావును కదిలించింది. దీంతో తమ గ్రామ పరిధిలోని పుష్కరాల రేవు, ఏటిగట్టు వద్ద స్నానాలు చేసే వారిని హెచ్చరిస్తూ ఆయా ప్రాంతాల్లో ఆయన బోర్డులు ఏర్పాటు చేశారు.



ఆలమూరు మెయిన్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



కె.గంగవరం మండలం అముజూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో తదితరులు

చిరస్మరణీయుడు ఎన్టీఆర్

• జయంతి వేడుకల్లో వక్తలు • ఎన్టీఆర్ విగ్రహాలకు ఘన నివాళి • భారతరత్న ఇవ్వాలని డిమాండ్



ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



రామచంద్రపురంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆలమూరు, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశంపార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలమూరు బస్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆ పార్టీ శ్రేణులు ఆవిష్కరించారు. నాయకులు వంటిపల్లి పాపారావు, ఈదల నల్లబాబు, రామానుజుల శేషగిరిరావు తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. గుమ్మిలేరు, చింతలూరు, జొన్నాడ, చొప్పెల్ల, మడికి, చెముడులంక, పెనికేరు, పెదపళ్ల, మోదుకూరు, నర్సిపూడి తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు.

గుమ్మిలేరులో 102 కిలోల కేక్ కట్ చేసిన అభిమానులు: ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో భాగంగా ఆలమూరు మండలం గుమ్మిలేరులో బుధవారం రాత్రి 102 కిలోల కేక్‌ను కట్ చేసినట్లు అభిమానులు తెలిపారు. ఈ వేడుకలలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలమూరు నాయకుల సందడి: కడప జిల్లాలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడులో ఆలమూరు నాయకులు సందడి చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సారథ్యంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావులతోపాటు పలువురు నాయకులు కడప మహానాడుకు వెళ్లారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా బుధవారం ఆలమూరు నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): దివంగత ఎన్టీఆర్ జయంతిని ఆయా ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పేరవరంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముళ్ళపూడి భాస్కరరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. బొబ్బర్లంకలో సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మి, దాసరి గణేష్ తదితరులు పార్టీ జెండాను ఆవిష్కరించి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అంకంపాలెంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు కుదప కృష్ణమూర్తి, తెలుగు యువత కరుటూరి రవి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఆత్రేయపురం మండల పరిషత్ సమావేశపు హాలులో ఎన్టీఆర్ జయంతిలో భాగంగా ఎంపీడీవో వెంకటరామన్, సిబ్బంది ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

ఎన్‌టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): దివంగత ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని పార్టీ సీనియర్ నాయకుడు గరిగపాటి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయ కులు జాస్తి విజయలక్ష్మి, పైట్ల గజలక్ష్మి, ఎం.సూర్యనారాయణ, పి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

మహానాడుకు తరలిన కార్యకర్తలు, నాయకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో జరుగుతున్న మహానాడుకు రామచంద్రపురం నియోజకవర్గం నుంచి బుధవారం నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో వెళారు. వందలాది మంది కార్యకర్తలు స్థానిక టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో వారు పాల్గొన్నారు. అనంతరం బస్సుల్లో మహానాడుకు వెళ్లారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పెంకె సాంబశివరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగపాటి సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అముజూరు గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్నికృష్ణ, దంగేరులో పార్టీ సీనియర్ నాయకుడు రావిపాటి వెంకట గణేష్ చౌదరి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహిం చారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి వారు నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, మిఠా యిలు పంచారు. టీడీపీ సీనియర్ నాయకులు ఎనుముల గోపాలకృష్ణ, రావిపాటి వెంకట గణేష్ చౌదరి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సలాది రమేష్, దంగేటి నాగేశ్వరరావు, మేడిశెట్టి పుణ్యమూర్తి, గిరి తదితరులు పాల్గొన్నారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ఎన్టీఆర్ జయంతిని మండపేటలో నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ చిరస్మరణీయుడన్నారు. మండపేట కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ అల్లూరి ఇందిరారాణి, తెలుగు యువత పట్టణ అధ్య క్షుడు వేగుళ్ల ఓంతేజ, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కె.రామారావు, వార్డు కౌన్సిలర్లు మలసాని సీతా మహాలక్ష్మి, గ్రంధి వీరవెంకట శ్రీనివాస్, కాళ్లకూరి స్వరాజ్య భవాని తదితరులు పాల్గొన్నారు.



రాయవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయవరం, (ఆంధ్రజ్యోతి): దివంగత ఎన్టీఆర్ జయంతిని ఆయా ప్రాంతాల్లో ఘనంగా జరిపారు. రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. రాయవరం, వెదురుపాక, చెల్లూరు, లొల్ల, మాచవరం తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కపిలేశ్వరపురం, అంగర, పడమరఖండ్రిక, టేకి, కోరుమిల్లి, వెదురుమూడి, కాలేరు, కేదార్లంక, తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో, పలు పంచాయతీ కార్యాలయాల్లో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ చిరస్మరణీయుడని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఐఎస్ రాజు పేర్కొన్నారు. బుధవారం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని కొత్తపేట ఉపసర్పంచ్ విశ్వ మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, బూసి భాస్కరరావు, ముత్యాల బాబ్జి తదితరులు పాల్గొన్నారు. వాడపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి సర్పంచ్ త్సామా బాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో బండారు బుల్లితాత, బండారు రాజేష్, పప్పుల కొత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

జీవితంలో యోగా భాగం కావాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 28 (ఆంధ్రజ్యోతి): యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల అన్నారు. కృతివెంటి వీర్రాజు పంతులు జూనియర్ కాలేజీ ఆడిటోరియంలో బుధవారం యోగాభ్యసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో అఖిల మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాలను 26 రోజులపాటు 26 ఇతివృత్తాలతో అమలు చేస్తామన్నారు. యోగా ప్రయోజనాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెవీఆర్ రాజు, ట్రైనర్ తొగర మూర్తి, పట్టణానికి చెందిన బాదంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో యోగా వేస్తున్న ఆర్డీవో అఖిలతో పాటు ఉద్యోగులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ పేర్కొన్నారు. యోగా డేను పురస్కరించుకుని కొత్తపేట మండల పరిషత్ ప్రాంగణంలో యోగాసనాలను వేశారు. కార్యక్రమంలో తహశీల్దారు వై.రాంబాబు, ఎంపీడీవో నరేష్‌కుమార్, ఏవో రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం పదిలమని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ అన్నారు. రావులపాలెం వేమన కల్యాణ మండపంలో ఎంపీడీవో మహేష్ ఆధ్వర్యంలో మండల స్థాయి యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీవో మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు వీటిని నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆర్డీవోతో పాటు ఇతర అధికారులు యోగా సనాలు వేశారు. కార్యక్రమంలో కార్యదర్శి దుర్గాప్రసాద్, డీఎల్‌డీవో టీవీ రాజేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో యోగా డేలో పాల్గొన్న ఆర్డీవో శ్రీకర్

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ యోగా చేసి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో యోగా పై సచివాలయ సిబ్బందికి, మండల పరిషత్ కార్యాలయం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ సరేంద్రరెడ్డి, ఈవో పీఆర్‌డీ గౌరీ కుమారి, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గాడ్ అల్లుడు, కుమార్తెకు
మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రాయవరం, మే 28(ఆంధ్రజ్యోతి): మాతృ వియోగంతో బాధపడుతున్న వెదురుపాక గ్రామానికి చెందిన గాడ్ మేనల్లుడు పెదపాటి శ్రీనివాసమూర్తిని బుధవారం అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పరామర్శించారు. గాడ్ సోదరి పి.వెంకట సూర్య సుబ్బలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుమారుడు శ్రీనివాసమూర్తి, కోడలు సత్యకనకదుర్గను మాజీ ఎమ్మెల్యే దంపతులు వెదురుపాకలో పరామర్శించి సుబ్బలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు.



చెల్లూరులో అగ్ని ప్రమాద బాధితులకు దుస్తులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

రాయవరం, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన దేవు కృష్ణారావుకు తాటాకింట్లో ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు 6 లక్షల ఆస్తినష్టం సంభవించిందని తెలిసింది. సంఘటనా స్థలాన్ని తహశీల్దారు ఐపీ శెట్టి సందర్శించి 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ దేవు వెంకట్రాజు, మాజీ సర్పంచ్ నూనె ఏసుబాబు బాధితులకు దుస్తులు అందజేశారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బాధితుడిని ఫోన్‌లో పరామర్శించి సంఘటనా స్థలాన్ని పరిశీలించాల్సిందిగా రెవెన్యూ అధికారులకు సూచించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన లీలాకృష్ణ

మండపేట, మే 28(ఆంధ్రజ్యోతి): గోదావరిలో మునిగి మరణించిన మండపేటకు చెందిన కలపాక రోహిత్ కుటుంబాన్ని, శేరులంక గ్రామానికి చెందిన పినిపే మహేష్ కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ బుధవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు ఆయన నివాళులర్పించారు. బాధితుల కుటుంబానికి పార్టీ పరంగా అండగా ఉంటామన్నారు. ఆయన వెంట మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలకు చెందిన జనసేన నేతలు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వేగుళ్ల లీలాకృష్ణ తదితరులు

అవయవ దానంపై పలువురు హర్షం

మండపేట, మే 28(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి గ్రామానికి చెందిన నున్న శివ రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురై మృతి చెందగా కుటుంబ సభ్యులు అవయవ దానం చేశారు. బుధవారం శివ మృతదేహాన్ని కూటమి నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కూటమి నాయకులు మాట్లాడుతూ శివ కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. వారిని పరామర్శించిన వారిలో కోన సత్యనారాయణ, కంకటాల మురళీకృష్ణ, పాలిక రమణ, గజ్జి వెంకటరమణ, చింతా శ్రీనివాసరావు, పళ్ల సన్యాసిరావు, తెల్లాకుల శివ ప్రసాద్, డాక్టర్ నాయుడు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల నిరసన

మండపేట, మే 28(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండపేట మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు చేపట్టిన నిరసన బుధవారం కొనసాగింది. ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పాలపర్తి సుబ్బారావు ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలుచుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సైనం భాస్కరరావు, సవరపు సంతోష్, కొండేపూడి వెంకటేశ్వరరావు, పీత వెంకన్న, మత్తాల రమేష్, వాసంశెట్టి వాసు, గంటి నవీన్, మందపాటి గన్నిరాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు, సభ్యులు

పశువుల దాణా పంపిణీ

ఆలమూరు, మే 28(ఆంధ్రజ్యోతి): పెదపళ్లలో రైతులకు బుధవారం రాయితీపై పశువుల దాణా పంపిణీ చేశారు. మండలంలోని పినపళ్ల, సంధిపూడి గ్రామాలకు చెందిన రైతులకు రాయితీపై పినపళ్ల సర్పంచ్ సంగిత సుభాష్ చేతుల మీదుగా అందజేశారు. మండలంలో 24.5 టన్నుల పశువుల దాణాను రైతులకు అందించామని పశువైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలమూరు అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.అనిత, గుమ్మిలేరు పశువైద్యాధికారి సుభాష్, పినపళ్ల పశువైద్యాధికారి ఈదల శ్రీనివాస్‌తోపాటు పలువురు రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.



పశువుల దాణా పంపిణీ చేస్తున్న దృశ్యం

హెచ్ఐవీపై జూన్ 31 వరకు అవగాహన

రావులపాలెం, మే 28(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం వెదిరేశ్వరంలో కళాజాత బృందం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై నాటక ప్రదర్శనతో అవగాహన కల్పించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ తాడేపల్లి, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మే 12 నుంచి జూన్ 31 వరకూ నాటిక ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. దీనిలో భాగంగా వెదిరేశ్వరం హైస్కూల్‌లో దీన్ని నిర్వహించినట్టు జిల్లా అధికారిణి డాక్టర్ భరత్‌లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నందిబాబు, ఐసీటీసీ కౌన్సిలర్ జి.గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.



వెదిరేశ్వరంలో కళాజాత బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు

ఆత్రేయపురం, మే 28(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం పేరవరంలో బుధవారం ఉచిత సిద్ధా ఆయుర్వేద వైద్య శిబిరంలో పలు సేవలు అందించారు. ముళ్ళపూడి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 140 మందికి ఈ సిద్ధ సేవలు ప్రత్యేక నిపుణులు అందించారు. గోఆధారిత, ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన జయశ్రీరామ్ సిద్ధ ఆయుర్వేద వైద్యశాలకు చెందిన ప్రత్యేక నిపుణులు కీళ్ల, నడుము, మెడ తదితర నొప్పులకు సిద్ధ ఆయుర్వేద చికిత్స ద్వారా సేవలు అందించారు. ప్రతినెలా ఈ సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముళ్ళపూడి సత్యనారాయణ, ముళ్ళపూడి భాస్కరరావు, మోహనరావు, రాము తదితరులు పాల్గొన్నారు.